శ్రీ

బ్రహ్మానందము

అచ్చ తెలుఁగు

కృతికర్త:

కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు.

కృతిభర్త:

శ్రీరాజా రావు వేంకటకుమారమహీపతిసూర్యారావుబహద్దరు
పిఠాపురము మహారాజావారు.

రాజమండ్రి:
కొండపల్లి ముద్రాక్షరశాలయందు
ముద్రితము.

కాపీరైటు] 1941 [వెల రు. 0—8—0

తొలిపలుకు.

అచ్చతెలుఁగు కబ్బములు వ్రాయుటంత కష్టములోనిది కాదు గాని గ్రంథము చదువునప్పు డది యచ్చతెలుఁగని తోఁపక మిశ్రకావ్యమువలెఁ దోఁపవచ్చునట్లు వ్రాయనగు. అట్లు వ్రాయుట మాత్రము కష్టతరము. మఱియుం దియ్యని తేఁటతెలుంగుమాట లేర్చి కూర్చుట యన్న సామాన్యము కాదు. "మాటల నాడినవడువునఁ దేఁటతెలుంగుననుగయితఁ దేలికదారిం బాటించి కబ్బ మల్లెద" అని నే నిందు వ్రాసినట్లు మన మిపుడుమాటలాడుకొనునట్టి తెలుఁగుమాటలతోడనే యచ్చతెలుఁగుకబ్బంబులు వ్రాయనభ్యాసము కలిగి నే నీపొత్తము వ్రాసితి నని చెప్ప సాహసించుచున్నాను. "శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిరూష్మ నిర్వచనైకాదశాక్షరి" యను నొకచిన్నిపుస్తక మనేకనియమములతో త,న,జ,డ,క,ర,గ, ల, ద, ట, య, అను పదునొకం డక్షరములు మాత్రమే గ్రంథ మంతలో నగపడునట్లు వ్రాసి యుంటిని. "కాళిదాసమయూరాదికవులకైనఁ గలవు దప్పులు" అనుటంజేసి యెట్టివారి కైనఁ దప్పులు పడుట తప్పదు. కావున నిందు దోషములు లే వని చెప్పఁజాలను.

ఈకబ్బము నేను గొన్నినాళులక్రిందటనే రచించి యుంచితిని. దీని నెవ్వరి కేని యొక్క మహారాజునకుం గానుక వెట్ట వలయు నని సంకల్పము కలిగినది. సర్వవిధముల సమర్థులు శ్రీశ్రీ పిఠాపురముమహారాజావారగు శ్రీరాజా రావువేంకటకుమారమహీపతిసూర్యారావు బహద్దరు వారని నిశ్చయించుకొని కొన్నిమాసములక్రిందట వారిదర్శనమున కేగి నా కోరిక యెఱుంగ విన్నవించితిని. విని యమ్మహారాజు "నేను గృతిం గ్రహించుటకు సమర్థుఁడను గాను" అని సెలవు దయచేయించినారు. సరే కానిం డని యప్పటి కే నేమియు నొండాడక యింటికి వచ్చి మఱియుం జర్చించి "ఇప్పుడు పీఠికాపురీశ్వరుండు గాక యచ్చతెలుంగుఁగబ్బముల గౌరవం బెఱింగినవా రరిది యనియు, ఆప్రభునే వాని యభిరుచి యెఱింగినప్రోడ యనియు నెంచి యయ్యేలికయనుమతిం గొనకయే యి ట్లాదొరపేర నీగ్రంథము ముద్రించి ప్రకటించితిని.

కవిత్వము చెప్పనేర్చిన నే నీయేఁబదిసంవత్సరములనుండియు ననేకదేశంబులం బరిభ్రమించి యనేకుల కనేకకృతు లిచ్చి వారిచే గౌరవింపఁ

బడుభాగ్యముంగంటిని గాని దానవిజితరాధేయుఁడును, విద్యాభోజుఁడును, దయార్ద్రహృదయుఁడును, కవితాప్రియుండు నగు స్వదేశప్రభువును సందర్శించి యేదే నొక్కప్రబంధము కృతి యిచ్చి వారిగౌరవముం గాంచలేకపోయితి నను నాకోఱంత నిట్లు చేసి తీర్చుకొన్నవాఁడ నయితి నని నాకిపుడు గలిగినసంతస మింత యని చెప్ప నశక్యము.

అచ్చతెలుంగుప్రబంధ మనఁగాఁ గేవలదేశ్యపదములతో రచింపఁబడినదానికే చెల్లును గాని తక్కినదానికిం జెల్లదు. చెల్లకున్నను మన పూర్వులు తద్భవాన్యదేశ్యాదిపదములు చేర్చి కూర్చి నదియు నచ్చతెలుఁగనియే చెప్పి గ్రంథములు చేసి యున్నారు. నేను నట్లే దేశ్యాదులు చేర్చియు దీని కచ్చతెలుం గని పేరు పెట్టితిని. ఇంతియకాక యిందు గ్రంథాదిని "ఆదిత శ్శ్రీశబ్దప్రయోగా ద్వర్ణగణాదిశుద్ధే రక్ష్యుచ్చయ శ్చ" అనుటంజేసి తెలుఁగు గాకున్నను మొదటిపద్యములో శ్రీకారముం జేర్చుటయే కాక సంజ్ఞావాచకములాంధ్రము కాకపోయినను బూర్వులవలెనే యిందు యథేచ్ఛముగా వాడి యున్నాఁడను. తెలుఁగులోఁ బ్రాసము లెందులకుఁ బుట్టెనో తెలిసినకారణంబునం జేసి నా కిష్టం బయిన ర, ఱ ప్రాసము లిందుఁ బొందుపఱచితిని. ఇందుఁ జూపట్టుకల్పన లన్నియు నేను గల్పించినవే యైనను "బాణోచ్ఛిష్టం జగత్సర్వ"మ్మనుటంజేసి "ఇది నాదియే" యనుటకు సాహసింపఁ జాలను.

ఈగ్రంథము మహారాజావారికిఁ గృతి యీయవలయు నని నిశ్చయించుకొనినప్పుడు మహారాజావారివంశావతార మంతయు సంపూర్ణముగా నిందు వర్ణింప నెంచితిని గాని గ్రంథము మహారాజావారిపేర ముద్రించుచున్నట్లెవ్వరికిని దెలియకుండం బూర్తిచేసి ప్రకటింప వలయు ననుతలంపుతో నట్టిగ్రంథము లెవ్వియుం బరిశీలించుటకుఁ గాని, తెలిసినవారి నడిగి తెలిసికొనుటకుఁ గాని వీలుపడినదికాదు. ఆకారణముచేతనే మహారాజావారియు, మహారాజ్ఞిగారియు, వారి పుత్రపుత్రికాదులయు చరిత్రాంశము లిందు సంపూర్ణముగా వివరింపబడియుండలేదు. ఈలోపము లన్నియుద్వితీయముద్రణమందు సవరించుకొందుననిమనవిచేయుచున్నాను.

శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి.

శ్రీరస్తు.

బ్రహ్మానందము

ఇష్టదేవతాప్రార్థనాదికము.

శ్రీల న్మేల్మి నెసంగుముజ్జగములం జెన్నారి తన్జేరి జే
జే లెల్లన్ జయపెట్టుచుం గొలువ వాసిం బెల్చనం బొల్చి కై
కో లెచ్చన్ బజ నేలువేల్పు మనుచుం గోర్కుల్ దగందీర్చి మేల్
గ్రాలన్ రావుకొలంబుమానికము సూర్యారాయనిం బ్రేముడిన్.

చ. అరుదుగఁ బాలవెల్లి మును నచ్చరచానలతోడఁ బుట్టి తా
మరలను మెట్టి నల్లనయ్యమానగుపేరెద నానిపట్టి యె
ల్లర గరువంపుఁగన్నిరపుఁబం దనలోఁ గొని వెల్గునట్టి యా
సిరిదొరసాని మంగయమచిన్నికొమారునిఁ బ్రేముడించుతన్. 2

ఉ. వెన్నునిబొడ్డుఁదమ్మిఁ గడువేడుక నత్తల లున్నబిడ్డఁ డై
క్రన్ననఁ బుట్టి నిక్కపుజగంబున నోళుల నాలు గ్రాలఁగాఁ
బన్నుగఁ దమ్మిగద్దెపయిఁ బైకొని బూమెలు సేయు బమ్మ లో
నెన్నుచు సూర్యరాయు నెద నెల్లపుడు న్నన రొప్ప మన్చుతన్. 3

క. వెలిమేనున్ వెలినగవున్, వెలితమ్మిం గొలువుసేఁత వెలయ జగములన్
వెలసి వెలింగెడుపలుకులపొలఁతుక మాసూర్యరాయు వేడ్కన్ బ్రోచున్

క. పసిపిల్ల పగిది మెలఁగుచు, విసువక జగమెల్లఁ బ్రోవ వెలసిన సత్తిన్
బసగలిగి కొలిచియెంతయుఁ, గొసరుదుసిరులిచ్చి కాచుకొనమాసూర్యున్

సీ. ముగు రై యెసఁగు వేలుపుల కిక్కయై యెవం
డలరి ముజ్జగముల వెలుఁగుచుండు
నన్నిజగంబుల కాదరు వగుపెను
మినుకుఁదల్లి నెవండు గనినతండ్రి

కటికచీఁకటి తిండికాఁడయి యెల్లర
కన్నయి వెలుఁగు నేగాములదొర
తనదు తేజునఁ జందురునకు నగ్గికి వెల్గు
లిచ్చి వెల్గించు నేయివముసూడు

తే. వెలయు నతఁడు వెన్నునికన్ను వేఁడివేల్పు
చదలురతనంబు చెయ్వులసాకిరి చలి
వెలుగునకుఁ దోడు వేడివేవెలుఁగులదొర
రావుసూర్యరాణ్మహీపతిఁ బ్రోవుఁ గాక. 6

తే. విద్దెలకు గాదె యన నొప్పు పెద్దబొజ్జ
గజ్జె లందెలు గదలంగ గుజ్జుకాళ్ళ
నల్లనల్లన మెట్టుచు నాటలాడు
నేనికమొగంబుదేవర నెంతు నెడఁద. 7

క. పుట్టినయప్పుడ పుట్టం, బుట్టినతేనియలు గ్రోలి మును కబ్బంబుం
బుట్టించె ననఁగఁ జవులం, బట్టిన జడదారికయితబళి యని యెంతున్.

క. తొలిపలుకు లచ్చుకట్టియు, నెలమిం దొలిబాసఁ బదియు నెన్మిది పొత్తం
బులు నన్ని తోడిపొత్తం,బు లొనర్చినయట్టితపసి పాడఁ వగ్గింతున్. 9

తే. పలుకుఁదొయ్యలి మగమేనఁ బరిఢవిల్ల
జగమునం దశిపజ లెన్నఁ దగలి పొగడఁ
బెక్కు లొకబ్బములు చవుల్ వెలయఁ జేసి
వాసి కెక్కినయక్కాళిదాసుఁ దలఁతు. 10

క. ముప్వేలుఁపు లసఁదగి మొగి, మువ్వరుసను భారతంబు మును దెల్గునుడిన్
నివ్వటిలం గా సలిపిన, ముప్పురఁ గబ్బంబు లల్లుప్రోఁడల నెంతున్. 11

తే. కన్నకొడుకులకన్న నన్నెన్ని గార
వమునఁ జదువు చెప్పినయట్టివారి గొప్ప

268388
25.3.73

వారి కగువారి నయ్యవటూరినాగ
లింగ మయ్యవార్లఁగారి వంగి కొలుతు. 12

క. అవధానము లనువిద్దెలఁ,దవిలితిఁ గడుకబ్బములను దగ సలిపితి నేఁ
గవిసార్వభౌముఁ డైతిని,నవు నన శ్రీపాదకృష్ణుఁ డనియెడివాఁడన్. 13

క. మాటల నాడినవడువునఁ, దేటతెలుంగునను గైతఁ దేలికదారిం
బాటించి కబ్బ మల్లెదఁ,దాటాదూటములు వచ్చుతఱి నవ్వకుఁడీ. 14

వ. అని యిచ్చవచ్చినవేల్పులకు మ్రొక్కు చెల్లించుట మొదలుగా మొదట నడవఁ దగిననడవడుల నెల్ల నడపి జగంబులం బొగడిత కెక్కిన ట్లొక్క చక్కని యచ్చతెలుంగుకబ్బంబు సలుపం దలంచి యొక్కనాఁడు. 15

సీ. రావురాచకొలంబురతనమ్మై వన్నెకు
నెక్కినచాగకాఁ డిజ్జగమున
వెరవరియై పిఠాపురమునాఁబడియెడు
మాగాని యేలెడుమణివకాఁడు
మంగయమ్మారాణి బంగారపుంబొజ్జ
పంటయై పుట్టినవన్నెకాఁడు
కైత నేరిచి తెన్గుకబ్బంబు లల్లెడు
వెరవరులకు నెప్డు పెట్టుచెట్టు

తే. అతఁడు వెలమవంగసమున నసముఁ గాంచి
లే దనెడుమాట యేనాఁడు లేక యెల్ల
పేదలకుఁ గొంగుబంగరు నై దలిర్చు
రావుగంగాధరునిసూర్యరాయఁ డలరు. 16

సీ. వేడుక కేనియు నాడి తప్పనివాఁడు
పలికి బొంకనివాఁడు వెలమదొరయొడయఁ

డొక్క-బమ్మముఁ గొల్చుచుండెడువాఁడు చ
దివినవా రనిన గౌరవము సేయు
విద్దెల నెప్పుడు వేడ్కమై నరసి ప్రో
వను దొరముం గట్టుకొనిన మేటి
తనకన్నపజ నట్లు తననేలపజలను
గనికరంబునఁ జూచి కాచుఱేఁడు

తే. ఎందు నేనాఁట నోటమి యెఱుఁగ నతఁడు
పట్టు పట్టిన విడువని యట్టిదిట్ట
యనదలను నక్కటికమున నరయువలఁతి
పుడమియేలికలందుఁ బెంపడరుపబువు.

చ. దొరలకు మేలుబంతి యని తోఁపఁగ వచ్చి మెలంగుచుండు నా
దొర కెఱిఁగింతు నన్నమదితో నట కేగి తలం ప దంతయుం
బరఁగెడుచొప్పునం దెలియఁ బల్కితిఁ బల్కిన నాతఁ డౌ ! బళీ
కరమరు దట్టికబ్బమును గైకొన నేఁ దగ నంచు నెంచెటన్.

తే. అనుటయును నేను మదిలోన నబ్బురపడి
యేలికా ! యేను దగ నందు వేటిమాట !!
జగమునం దొక్కరుఁడు నీకుఁ జాలినట్టి
చాగకాఁడుండునే నేలసాములందు.

సీ. తినఁ గట్టఁగా లేనిదిక్కుమాలినవారి
నేల నేల న్వేల నిడితి వీవు
కోకనాడుకలేజి కే కాక వే ల్పెక్కు
చదువుబడులకు నొసంగి తీవు
చదువరులందు బల్ సన్నఁ గాంచినవారిఁ
గడ నుంచుకొని ప్రోవఁ గలిగి తీవు
వేనవే ల్వెచ్చించి మానుగ సూర్యరా
యనిఘంటు వ్రాయింప నైతి వీవు

తే. మంచికబ్బంబు లన్నచో నెంచి వాని
నెన్నివేలైన నచ్చువేయించి తెలుఁగు
బాస వెలయించుచుంటివి బళిర! నిన్నుఁ
బోల్పుడమి లేఁడు గలఁడె యీపుడమి నిపుడు. 20

ఉ. లేదు నిజంబు చెప్పెదను లేవడిమాటలు వల్కఁ బాడియే
వేడుక నాదుకబ్బమునఁ బెంపును సొంపును గూర్మి నావుడున్
లేఁడు మఱొక్కఁ యప్డు వివరించి నుడిం బచరింతు నంచు న
నోన్నడక గారవించెఁ గడు నొప్పుమెయి న్నన రుప్పతిల్లఁగన్. 21

వ. నేను నోఁ గాతమని యన్నేలయేలికసెలవు గొని యింటికిం జను
దెంచి దానిన మఱియు మఱియుం దలంచుచుఁ బొగడ్త లొల్లని
యతండు నన్నట్లు పలుకుట సాజం బయినగోనంబ కొని వేఱొకఁ
డెద్దియుం గాదు. కైతగూర్పరు లెల్లరు తమకబ్బంబుల నున్నవి
కొన్నియు లేనివి మఱికొన్నియుం జేర్చి పబువుల నగ్గించుచుందు
రందునన తా నంతవాఁ డయ్యు నెంత లెంతవారికబ్బంబుల నైనఁ
గైకొనం దలంపనివాఁ డయ్యె నదియ కతంబున నా కిట్టినుడికారం
బిచ్చెఁ గాని మఱియొం డెద్దియుం గా దని యేర్పఱించుకొని
యయ్యొడయని యియ్యకోలు గొనకుండఁ బొగడ్తలపొంతం బోవ
కున్నది యున్నట్టు లన్నేలయేలికగోనంబులం బేర్కొనుచుఁ గబ్బంబు
చేసి యారాచమానికంబున కప్పనంబు గావింపనెంచి ముందుఁ గైతకుఁ
గైసేతగా నారావువారివంగడంబు తెఱం గెఱింగించెద. 22

కృతిపతివంశావతారము

తే. పద్మనాయకు లన వెల్మవా రనంగఁ
బేరు గైకొని దొర లయి వెలయువారు
వేవెలుఁగు రేవెలుంగులవై వెలుంగు
కొలములకుఁ జెందుతేం డ్లని తెలియ వలయు. 23

ఉ. రాచకోలం బెదో కతము గ్రాలుట వెల్మకులంబునాఁగ నై
తోఁచి జగంబునం బ్రబలి దొడ్డగొనంబుల నొప్పుచుండు నా
కూచికోలంబువా రెపుడు గొప్పతనంబును బాయ కుండియున్
రాచరికంబు సేవల నొనర్తురు వారలు రాచవారలే. 24

క. కావున వారికి బీరముఁ,జేవ,యునుం బట్టుదలయు సిరియు ననంబున్
గావలసినంత తేగము, లో వెలయంగలిగెఁ బుడమిలో దొరతనమున్.

వ. ఆవెలమవా రిప్పుడు రేచర్ల, రేవనూళ్ళ, రేపాల, లోనగుడెబ్బది
యేడు తెగలవారై రందు రేచర్లవారిలోఁ గొంద ఱొడయండ్లు
పుట్టినవెనుకఁ జెన్విరెడ్డి యనుపిల్లలమఱ్ఱి బేతాళనాయండు పుట్టి
యోరుంగంటిపీటఁ గాకతిప్రతాపరుద్రగణపతిదేవులచెంత మాగాణం
బులం గాచుమన్నీఁడునుం దళవాయియు నై పేరంది పొగడిత కెక్కి
రేచర్లకొలంబునకు మొదటివాఁ డని యసంబు గాంచె నారేచర్లవంగ
సంబు (గోత్రము)లో రావువారు, వెలుగోటివారు, సురభివారు,
సూరానేనివారు లోనగునింటిపేళ్ళు గలవారు ముప్పదియాఱు తెగల
వారుగలరు వారిలో రావువారు తూర్పుమాగాణంబు లేలుమణివ
కారై పేరుపొందిరి. 26

క. అలరావుకొలమువా రో, జ్జలు విలువిద్దెలకు దొరలు జగముదొరలకున్
బులుగడిగినముత్తెంబులు, వలఁతులు నొడయండ్లు పజకుఁబరికింపంగన్

వ. ఆవెలమదొరలలోఁ బూర్వమాగానులం బేరు మ్రోసిన బొబ్బిలి
యనురాచప్రోలం గొంద ఱొప్పి రాలకింపుఁడు. 28

ఉ. గిబ్బవజీరు ముమ్మొనలఁ గేరెడు వాలున కైనఁ గానలో
బెబ్బులికోఱ కైనఁ గనిపించెడు నించుక వాడి వీడుటల్
బొబ్బిలిపీటి కోట నడిఁ బుట్టినదోమయు వాడిపోడిమిన్
గొబ్బునఁ బెద్దయేనికకుఁ గొల్తల సూపెడుఁ బట్టి నెట్టనన్. 29

వ. అట్టి యసంబు గాంచిన వారిలో మొదటిలెక్కకగు రంగరాయం డోల
మాన గొనక తనకోట ముట్టడింపవచ్చిన వేనవే లగుకఱకుతురక
మూఁకఁగోడం బోరి పోకార్చి తనకొలంబువారిక కాక తెలుఁగునాటి
వారికిం బేరుదెచ్చె నట్టి పేరుగలరావువా రెల్లచోట్లం బేరెన్నిక
కెక్కి రంత. 30

తే. వారిలోపలఁ బెక్కండ్రు వరుసతోడఁ
గడఁగి నేలకు ఱేండ్లై జగంబుపజల
నరసి యేలుచుఁ గడచినయంత మీఁద
వెలసె నీలాద్రిరావను బిరుదుమగఁడు. 31

వ. ఆతండు తనతాతదండ్రులు గడించినపిఠాపురం బనురాచటెంకినేలుచుఁ
గాపురంబుండె నదియును. 32

సీ. పదియు నెన్మిది యయి పరఁగుపీఠములందుఁ
బురుహూతికకు నెద్ది పొదలుటెంకి
చెఱకుపానకమునాఁ జెన్నారునేలేరు
పాఱు నేప్రోలికిఁ బ్రక్కనుండి
యేవీటినడుచక్కి నెపుడునుం బాఱెడుఁ
జెఱకులకాలువ చెన్నుమీఱి
బిందుమాధవుఁ డను వెన్నుఁ డేపేటలోఁ
గుక్కుటేశ్వరుఁ గూడి కోర్కి నుండు

తే. పోలినాటికి నేప్రోలు మొదటిలెక్కఁ
బొదలుఁ జదువుల కేయూరు పుట్టినిల్లు
అట్టినుడికారమును గన్నయట్టిదగుచుఁ
గాపురంబున కనువు పిఠాపురంబు.

ఆ. అది కళింగములను మొదటిప్రోలని వైదు
వేలయేండ్లనాఁడు మేలుపొత్త

ములను రేఁగుగడ్డఁ బుట్టినతపసిరా
యందు వ్రాసె దానిదండితనము. 34

వ. ఇట్లు జగంబునం బొగడిత కెక్కినట్టిపిఠాపురము మాగాణంబునకు
మన్నీఁ డయిన నీలాద్రిరాయండు. 35

తే. పుడుకఁదోడుకుకన్నను వేల్పుపాలనుబ్రమాఁకు
కన్నఁ గడునీఁగిచే వాసి గన్నయొడయఁ
డగుచు నెల్లరఁ దనుపుచు ననువు మీఱె
నాజనిర్మాదారుఁ బొగడంగ నలవి యగునె. 36

చ. చదివినవారలం బజల సాఁకఁజేయుటె కాదు వార లె
య్యది తనుఁ గోరినన్ విసువ కయ్యది వారల కిచ్చి నిచ్చలున్
వదలక ప్రోచె రైతు లగువారిని బిడ్డల యట్లు కాచె నె
య్యదనున నెట్లొసర్ప నగు నట్లు పొనర్చెను రాచకర్జముల్. 37

మ. చెఱువుల్ తోఁటలు బావల న్నిలుపుటల్ జేజేలగు ళ్యాళ్ళ బం
గరువుం బూడ్చుట లోప్పుబావులు కడుం గబ్బంబులం బేరు ల
బ్బుర మెచ్చం గను నిల్పుటల్ సలిపి యప్పొల్పొందుతేఁ డెంతయేఁ
బెరిమం బారులపట్లకున్ వడుగులుం బెండ్లిండ్లు చేయించె మున్. 38

తే. నేలపైఁ బుట్టి మిక్కిలి నెఱి నెసంగు
పెట్టుచె ట్టసి కైతలఁ బేరుఁ గాంచి
పుడమి యేలుచు నెంతయుఁ గడిమి మెఱసి
రమణమైఁ గ్రాలె నీలాద్రిరాయఁ డతఁడు. 39

క. గరితతనంబున సత్త్రిం,బురుడించును మించు ననఁగఁ బొలిచినపడఁతిన్
గరితన్ భామాయమ న,ద్దొర పెండిలియాడె నసము దొలఁకాడంగన్

సీ. నిలుకడ లేనిదై నెఱి నెల్లరను గూడఁ
బడి చెడు లచ్చి యేపాటియదియొ

తలవాఁకిళుల నెప్డు నిలిచి పెన్ఁతాఁగ యా
పలుకులచాన యేపాటియదియొ
మగఁడు గొల్వంగ నింపుగ సందెలను గద్దె
నాటాడుసత్తి యేపాటియదియొ
మగని గాదని మాఱుమగనిపొందికలకు
మాటాడుశచియు నేపాటియదియొ
తే. అనుచుఁ గడుదూఱుచుం దన పెనిమిటి యెద
నిలిచియును బల్కునెలవున నెలమి గొనియుఁ
గలసియు ననుంగుఁ గూర్చుచు మెలఁగికొనియుఁ
గొలుచుచుండు భావాయమ్మ గొనము పమ్మ. 41

వ. అయ్యాలుమగళ్ళకు సూర్యారావు, కుమారవేంకటరా వనునిద్దఱు
కొమాళ్ళు పుట్టి రందు సూర్యారావు. 42

సీ. నడయాడ నేర్చిననాఁడె పున్నెము గాలు
గడుగుల నడపె నీపుడమియందు
నత్త తాత యటంచు నాడ నేర్చిననాఁడె
యలహరిశ్చంద్రునిహరువుఁ దాల్చె
నోనమాల్ నేర్చెడునానాఁడె చాగంబు
టాఁకుల వ్రాయుచొ ప్పరసికొనియెఁ
జీఱలు గట్ట నేర్చిననాఁడె కుడికేల
బీదలఁ బ్రోవంగ బిరుదు గట్టె
తే. రమణయమ్మను బెండ్లియై రమణమెఱయ
వీడులం దేగుఁ బెండ్లికై వెడలునాఁడె
వెడఁదయస మనుసకి నేల వెడల నడిచెఁ
బొగడఁ దగడె సూర్యారావు పుడమిఱేఁడు. 43

వ. ఆసూర్యారావునకు ధర్మారావు, వేంకటమహీపతిగంగాధరరామా

రావు, వేంకటరా వనుముగ్గురు కొమాళ్ళు పుట్టి రందు వేంకటమహీ
పతి గంగాధరరామారాయండు. 44

సీ. తనయునం బెప్ట లచ్చినిఁ బల్కుఁజెలిఁ గట్టఁ
గని బీతుఁ గొని పాతి కడలు దాఁటె
దనచాగ మావేల్పుమనికిపట్టున మను
మొదవును సిగ్గుమై ముంచి మించెఁ
దనతేజు వెలుఁగువెన్నునికంటికన్నను
దిన్ననై జగముగఁ దేటి మెఱసెఁ
దనదొరతన మెల్లరను గన్నతలిదండ్రు
లను మఱపించెడు పనిగ నేతె

తే. నాఁగఁ బొగడొందఁ దగి కొనసాఁగు నెవఁడు
రావుబహదర్ మహారాజరాజు మొదలు
గలుగుబిరుదులు గొని రావుకొలమునందుఁ
బ్రబలె నల్లగంగాధరరామరావు. 45

సీ. కడఁగి పాల్కడలిలోఁ గాఁగిలింతలఁ దేరి
యవ్వేలిమలమీఁద నాటలాడి
చలువలఁదేనితోఁ జెలికార మొనరించి
గిబ్బరాయనిమీఁదఁ గెరల కెక్కి
టెక్కరాయనితోడ నెక్కసక్కము లాడి
యలవేలుపులగారు నక్కఁ జేర్చి
వెలిమ్రాఁకుతోఁ గోరికల నెల్ల నెలకొల్పి
చిలువయేలికతోడఁ గలసి మెలసి

తే. నారదుండొట్టివార్ తనవారు గాఁగ
నలముకొనిముజ్జగంబులయందు విరిసి

ప్రోడ యై తిరుగాడు నెప్పుడును రావు
కొలమురాయనియన మనునలరునెలఁత. 46

క. ఒకవిద్దె నేర్చి యతఁ డిం, నొకవిద్దె న్నేర్వఁడనఁగ నొప్పదు జగమం
దిఁక లేవు విద్దె లనఁ బొం, దికమైఁ గలవిద్దె లెల్లఁ దిరముగ నేర్చెన్.

తే. బులుసుపాపయ్యశాస్త్రికి ముప్పదియును
హింగుకోనేశశాస్త్రికి నెన్ని యేని
యకరములనేల నిచ్చియు ననయ మెల్లఁ
జదువరులఁ బ్రోచె సిరు లిచ్చి చదురుఁ డతఁడు. 48

సీ. పలువురకు న్నిమేబడుల నేల లొసంగె
నూళ్ళు పల్లెలు చాల నొప్పఁ జేసెఁ
దనతండ్రిపేరఁ గట్టెను గోకనాడుచెం
తను సూర్యరావుపేటను, బిఠాపు
రమునఁ గుమారుపేరను నగరము గట్టె
మల్లవరమ్మున మఱియు సూర్య
రావుపేటం గట్టెఁ ద్రవ్వించె, జెఱువులు
తోటలు నెలకొల్పె మేటిదేవ

తే. ళమ్ము కట్టించె సర్పవరమునందు
రావువంశముక్తావళి నా వెలసిన
కబ్బమును గొని చేసినసుబ్బరాయ
శాస్త్రికిం బసదన మిచ్చెఁ జాల మెచ్చి. 49

వ. ఆయెడయందు తొల్లి శ్రీకృష్ణుండు పెక్కురం బెండ్లియాడినట్లు మంగయమ్మ, సీతయమ్మ, సుబ్బయమ్మ రామయమ్మ భావయమ్మ, లక్ష్మీసీతయమ్మ, రామయమ్మ యను యేడ్వురు దేవేరులం బెండ్లియాడె నందు మొట్టమొదటిదేవేరి మంగయమ్మరాణి. 50

ఉ. ఈలువు గన్నతల్లి నుది నెప్పుడు పెన్మిటిమాట కడ్డుగాఁ
బోలు నటంచుఁ బల్కుటకుఁ బోయియెఱుంగదు పల్కు బొంకుటల్
కోలుమసంగి యుండుటలు కోడిగముల్ పచరించుటల్ గనం
జాల రోకప్పు డామెకడ సత్తికి నెత్తగు నామె యన్నిటన్. 51

క. అలమేల్మంగమయీయమ, కలుములచెలియనఁగనొప్పెఁ గలవారికినై
కలవారియింట మెలఁగెడు, మెలఁకువకై మంగయమ్మమేలుంగాంచెన్

క. గరిత యనఁ దెలివి గలదనఁ బేరిమన్ సిరులొసఁగి పజలఁ బెంచెడునదినా
నరయఁగ నగుగంగాధరు,దొరసానిం బొగడఁ జెలువదొరయుంగలఁడే.

వ. ఆమంగయమ్మ దేవేరియందా వేంకటమహీపతిగంగాధరరామరాయండు వేంకటకుమారమహీపతిసూర్యరాయనిం గనియె నారాయండును.

ఆ. చిన్నతనమునందె కన్నతండ్రియుఁ దల్లి
పుడమి విడిచి చనుట నిడుమ కయ్యెఁ
బగతు రెన్నియేని యగచాట్లఁ బెట్టిరి
కాని వమ్ము లయ్యె వానిపట్ల. 55

క. చదువుం జదురును మున్నై
పొదలఁగ, దా వెనుకఁ బుట్టి పొదలెడు ననఁగాఁ
జదివెడునదనున నెల్లరఁ,
బొదలంగాఁ జేసెఁ జిన్నపుడె యాతఁ డొగిన్. 56

ఆ. అతఁడు పుడమియేల నమరినదొర యైన
నాఁడుగోలెఁ బజలు పోడిమియును
హాయి గలిగి కన్నయత్తలిదండ్రులఁ
దలఁప రతఁడె తల్లి దండ్రియు నని. 57

చ. గొనములు గుంపు గూడి పజకున్ మదు లుల్లసిలంగ జేసిరూ
పును గొని సూర్యుఁడై పుడమిఁ బొల్పుగఁ బుట్టెనొ లేక తల్లి దా

గొనముల నుగ్గునన్ మెదిపి కొమ్మ్రని పోసెనొ బొజ్జలోనఁ గా
కను వగునగ్గొనంబు లిటు లారయ నాదొర కేల కల్గెడున్. 58

చ. తనతలపోయుకర్జ మది తప్పక తా నెఱవేఱినట్టిదై
తన కెదు రేగుదెంచెడు వితంబున నయ్యెడు నెల్లనాఁడునున్
మునుపటి వైనపుట్టువులఁ బొల్పుగఁ జేసినమేటిపున్నెమే
యని పజ లాకొమారు ననయంబును మెచ్చుచునుందు రిచ్చమై. 59

ఉ. భారత మన్ననాతనికి బత్తియు సత్తియు సంతసంబు నా
భారత మెన్నియే పరులు వల్లె యొనర్చియు నందు నొకతల్
గోరికతో నెఱింగియును గొంతనరాని కడంకఁ బున్నెపుం
దారి మెలంగు నట్టిఁడగు నల్వురు మే లని మెచ్చు మచ్చునన్.

సీ. పుడమిపైఁ బొడమిన పుడుకుమానిక మన
నడుగ లే దన కిచ్చునట్టివాఁడు
తనపజ్జ నూర్లు వేలు నొసంగి చదువరు
లను బెక్కురను నిల్పుకొనిన మేటి
తెలుఁగుబాసం దేటతెల్లం బొనర్చుక
బ్బము సేయ వే లిడ్డ పబువుమిన్న
యనదలౌవారల నక్కటికంబున
నరసి కాపాడెడునట్టి ఱేఁడు

తే. విద్దెలకుఁ గాను వేలవే ల్వెచ్చఁ బెట్టి
పెట్టుచెట్టనఁ బేరంది నట్టిదిట్ట
కడిఁది మోమోట గలిగినయెడఁదవాఁడు
రావులకు మానికము సూర్యరాయఁ డెన్న. 61

మ. "దునియామే నహీ రాజ" యన్ననుడి కై తోరంపురాలచ్చితోఁ
జను నప్రావులవంగసం బనెడు మేల్సంద్రంబునన్ లచ్చి వా

సినిఁ బుట్టింది సిరుల్ చెలంగ నగు లక్ష్మీచిన్నమాంబన్ జగం
బున తేం డ్లెన్నఁగఁ బెండ్లియాడి మిగులం బ్రోల్పొందు నాతండిటన్.

సీ. గరితతనంబునఁ బురుడించు ననసూయ
నోరిమిం బుడమికి నుద్ది వచ్చుఁ
గడిమి వేలుపుతేనిగరితకు నెనవచ్చు
సిరుల లచ్చికిఁ జాటి చెప్ప వచ్చుఁ
బుడుకున దేవళ్ళతోడుకుతో జతపడు
దొరతనంబున సత్తి దొరయ వచ్చుఁ
జమువునం బలుకులసకియకు జోడగుఁ
జదురున సీతకు సాటి వచ్చు

తే. అనుచు నెల్లరుఁ గొనియాడునట్లు మగని
కెప్పుడుం దోడునీడయి యెడము లేని
కూర్మి పేర్మిమై నెంతయుఁ గూర్చుచుండు
నట్టి దగుచు లక్ష్మీచిన్నమాంబ దనరు. 63

తే. చదువు సంతల నేమంబు జరుపుటయును
మంచినోములు నోఁచుట మంచికతల
వినుట పెనిమిటి బత్తిమైఁ గనుచునుంట
యామె నిచ్చలు పొనరించు నట్టిపనులు. 64

వ. ఆచిన్నమాంబయం దారాచమానికంబు వేంకటమహీపతిగంగాధర రామారావు, వేంకటమహీపతిసూర్యారావు నాఁ బడు నిద్దఱు కొమారులను, మంగయమ్మ, భావయమ్మ, సీతాదేవి, కమలాదేవి యను నల్వురు కొమరితలం గాంచె నందు వేంకటమహీపతిగంగాధరరామరాయండు. 65

శా. తానుం దమ్ముఁడు రామలక్ష్మణులు నాఁ దళ్కొత్తి యెల్లప్పుడున్
మేనున్ నీడయుఁ బోలెఁ బాయక మదిన్ మేలెంచి పోలించుచున్

జా నొప్పంగను విద్దెలం జదివి పెల్చన్ రాచకర్జంబులం
బూనం జాలి మెలంగుచుండ్రు దొర లెప్డున్ మెచ్చుమ చ్చేర్పడన్.

శా. కైతం గట్టఁగ నేర్చి పేర్చినతమిన్ గబ్బంబులం గూర్పరుల్
జోతు ల్దేలుచు నున్నవంచుఁ బొగడన్ జోడించి కావించుచున్
జోతల్ సేయుచుఁ దల్లిదండ్రులను గొల్చున్ రామరాయండు తాఁ
దాతం బోలినతేగముం గలిగి హత్తక్ సొంపు పెంపొందుచున్. 67

తే. అతఁడు చేసె స్వార్థత్యాగ మనఁగ మఱియు
నవలిలోకమునుండియాహ్వాన మనఁగ
నామరహితము, తరగలు నాఁగఁ జినుకు
చిందు లనఁ గబ్బములు కైత చెన్నుమీఱు. 68

చ. చెలఁగెడుపీటప్రోలుదొర చిన్నకొమారుఁడు సూర్యరాయఁ డిం
పలరుచు విద్దెలం జదివినట్టిఁడ యై తనుఁ గన్నతండ్రియుం
దలియును నన్నయుం దెలుపుదారి మెలంగుచుఁ బెద్ద లన్న మి
క్కిలియును గారవంబు గలిగించుచుఁ బెంచుచు బత్తిఁ గొల్చెడున్.

ఆ. తెలుఁగుకైపు చేయఁ గలమిష నొక్కండు
చేసి తల్లిపేరఁ జిన్నమాంబ
కైపుమిష నటంచు రూపు గావించె నా
తండు తనదుచదురు దండి కెక్క. 70

చ. చదువరు లన్నఁ గైతల నెసంగెడు వా రన మంచిపద్దెముల్
చదువుట యన్నఁ గబ్బములసాము లనక్ మఱి వారిపొందు నాఁ
బొదలుచు మంచికైదములు పోహణ సేయుచుఁ బెద్ద లందు బ
త్తి దగిలి తేగకాఁ డయి పదిం బదిగాఁ గను నాతఁ డెల్లరన్. 71

మ. కొడుకుల్ గూఁతులునాఁతియుం గొలువఁగోర్కెంజేసి మాగానులం
గడిమిం గైకొని యేలుచుం బజకు వేడ్కం గూర్చుచుం దన్ను వేఁ
డెడు వారిం గని కాదు పొమ్మనక మేటిం జేయుచుం గోర్కె లె
ప్పుడునుం దీర్చుచుఁ బెట్టుచె ట్టనుచు మెప్పుంగాంచె సూర్యుండొగిన్

క. అలసూర్యమహీపతి గొన
ములు నడవడు లొప్పు లబ్రములు విని కనువా

రలకే తెలియఁగ నగు నేఁ
డెలుపుట కొండాట గామి తెల్లము గాఁగన్. 37

సీ. ఎవ్వానియింటిలో నెపుడుఁ దామరతంప
రై పాడిపంటయు ననువు మీఱు
నెవ్వానిముంగిట నిసు మిడ రాలని
యట్లు ప్రజల్ వచ్చి చరుగుచుండు
రెవ్వానికొలువున నెల్లరు ప్రోడలు
చదువులఁ బెనువాదు సలుపుచుండు
రెవ్వానిదొరతనం బెల్లప్రజల నొగి
నారసి బ్రదికించునట్టి దగును

తే. అతఁడు పీఠప్రోల్సర్కారు నారయునొడ
యం డగుకుమారసూర్యారాయండు సుకము
సిరులు కొడుకులు కూఁతులు పరఁగఁ బుడమి
గలుగు నందాక మనుఁ గాక చెలువు మీఱ. 74

షష్ఠ్యంతములు.

క. అలరావువంగసం బన
వెలసినపాల్కడలిఁ బుట్టి వేల్పులవేల్పుం
గొలుచుచు నందఱకన్నుం
గలువల నలరింపఁ జేయుఁ గలరాయనికిన్. 75

క. దేవళ్ళమ్రాఁకు మానిక
మావున్ బిడియమునఁ ద్రోయు ననువున జగమం
దీవులవాఁడై గొనముల
తావై వెలుగొందునేలదాలుపు దొరకున్. 76

క. అంకిలి లేకీజగమున, సంకెల లెడఁ బాపి ప్రజల సాఁకగ నగుమే
ల్పొంకపుఁ గనికరపుగనికి, వేంకటమహీపతికి మేటిబిరుదుమగనికిన్.

వ. తరుగనిసిరులు నమరుకొమరులును గడుమనికియుం గలిగించు నట్లు
వేల్పులవేల్పున కప్పనంబుగా నాయొనర్పంబూనిన బ్రహ్మానంద మను
నచ్చతెలుంగు కబ్బంబునకు నిబ్బరం బగుత్రోవ యెట్టిదనిన. 78

బ్రహ్మానందము

ప్ర థ మా శ్వా స ము.

క. కొంతన కంతటిలోఁ దా, నంతయుఁ దనలోన నిండ నంతయుఁదానై
యింతకునింతయునంతకు,నంతయునై వెలుగువేల్పుననయముఁగొలుతున్

క థా ప్రా రం భ ము.

తే. నైమిశం బనునడవిలోఁ బ్రేముడిఁ గొని
శౌనకుం డనుజడదారిచందమామ
యడుగఁ గటివేల్పునడుగునఁ బొడమినట్టి
కొలముజడదారి యిట్లని పలుకఁ దొడఁగె. 2

తే. అలపరీక్షితుఁడు శుకునివలన మంచి
కతల వినుచు నీపుడమికిఁ గలుగఁ జేసెఁ
దనదుపే రతం డెవ్వఁ డతనికొలమ్ము
గొనములును నెట్టియవి తెల్పు మనియె నతని. 3

వ. అనిన నతం డతని కిట్లని చెప్పం దొడంగె. 4

స్వాయంభువమను వంశము.

మ. పలుకుంబోఁటిమగం డెదం దలఁపఁగా స్వాయంభువుం డన్నపే
రలరం బుట్టి కొమారుఁ డంత మనువై యాతం డొగి న్ముజ్జగం
బుల నేలెన్ శతరూపఁ బెండ్లి యయి యప్పూబోఁడియం దిర్వురం
గొలముం దేజునఁ గూర్చుపుత్త్రులఁ గోర్కుల్మిఁ గాంచెం జుమీ.

తే. బడిఁ బ్రియవ్రతుఁ డుత్తానపాదుఁ డనఁగ
నలరు నయ్యిద్దఱు కొమారు లందుఁ బెద్ద
వాఁడు గొనములఁ దేజునఁ జూడఁ బెద్ద
యనఁగఁ గొనియాడఁ బడియెఁ బ్రియవ్రతుండు. 6

చ. అతఁ డిలు నింటిమాబిడను నన్నియునుం బెడబాయకుండి త
న్నతికినవేలుపుందబిసి యాడినచూటలు వట్టి తండ్రి మె
చ్చితి నన నేల యేలి కడుఁ జెన్నలరారియుఁ బెక్కులేండ్లు తా
సుతకుఁ బసిండిపుట్టమును జుట్టినవేలుపులోనఁ జేరెఁ బో. 7

వ. అంతనాప్రియవ్రతుండు తేఁడై విశ్వకర్మకూఁతు రగుబర్హిష్మతి యను నామెయందు నాగ్నీధ్రుండు లోనగుపదుగురు కొడుకుల నూర్జస్వి యనునొక్కకూఁతు నొండుదేవేరియందు నుత్తముఁడు, తామసుఁడు, రైవతుఁడు ననుమువ్వురుకొడుకులం బడసి యెన్నియే నేండ్లు నేల యేలుచుఁ బసిండిగట్టుచుట్టునుం దిరుగువేఁడివేల్పు వెనుకటిచక్కిం గల చీఁకటులం బెడఁబాపుదు నని చీఁకటిగొంగ తేరితోడ నీడయిన తేజుఁ గల తేజీలం దేజరిల్లునొక్కయరదం బెక్కికొని రెండవచాయమొగం డన నేడునూఱు లావలచుట్టునుం దిరిగె. అపుడయ్యరదంపు గిఱ్ఱలయంచులదారు లేడు నేడుసంద్రంబులు నానడిమిసందు లేడు నేడుదీవులు నయ్యె నవ్వి జువ్వి, నేరేడు, ఱెల్లు, కొంగ, కూర, బూరుగు, తామర యను పేర్లనొప్పె. అందు నేరేడుదీవి నూఱువేలయామడలు కొలత గలది. తక్కినయాఱు నొండొంటికి రెండింతలు పెచ్చుపెరుఁగు. అట్టి తేజుగల ప్రియవ్రతుండు పుడమిం గొడుకులకుం బంచియిచ్చి తాను రాచతబిసిమై తుదకు మీఁదిజగంబున కరిగి నిలిచియుండె నంతట. 8

శా. తన్నుం గన్నప్రియవ్రతుండు చన నాతర్వాత నాగ్నీధ్రుఁడున్
మన్నింపం బజఁ దండ్రియట్ల పొదలింప న్నేర్చి నేరేడుపే
వి న్నేమంబున నేలెఁ బెక్కు లగుచున్ విన్నాణ మానేండ్లు దాఁ
గన్నాకై మెకిమీఁదులందు ననముఁ గాటంబుగాఁ బెంచుచున్. 9

ఆ. అతని వేలు పన్న నన వచ్చు గొనముల
గనియుఁ గనికరంబు గలుఁగువాఁడు
వాడనట్టిసిరులు వడసినయొడయండు
వంగసమునఁ జాల వన్నె కెక్కె. 10

క. కడునేం డ్లిట్లాతఁడు తన, పడఁతుకతోఁ గూడి సంతవలఁతిని నెమ్మిం
గడుకొని యేలుచునుండియుఁ, గొడుకులు లేఁట్టివగను గుతిలంబడుచున్.

వ. తనడెందంబున నొక్కనాఁ డిట్లని తలపోసె. 12

చ. కుడువఁగఁ గట్టఁ గల్గినను గొల్లఁగ సొమ్ములు దాల్చి పొల్చినన్
మడఁతులపిండు గొల్చి కడు మన్ననఁ జేయుచు నంటి యుండినన్
గడఁ గొన విద్దెలం జదివి క్రాలెడువా రయినం దలంపఁగాఁ
గొడుకులు లేనిమానిసులకుం గుదురింతయుఁ గాదు నెమ్మదిన్. 13

శా. కాల్సే యాడుచు నెంతదాఁక సిరులం గావించు నందాఁక నా
సల్పాగించుచుఁ గూడి మెత్తు రతనిన్ సైఁదోడులు న్నెయ్యు రి
ల్లా లుస్టా ల్పరివారు నెల్లబలగం బాయింతయుం దప్పి ము
క్కాల్సేరం జనునప్పు డెవ్వరును గ్రేగంటం గనం బో రయో. 14

ఆ. సడికి వెఱచి యైనఁ గడుఁ బత్తి నైనను
గన్నవా రటన్న గారవమున
నైన ముదుక లైన యత్తలిదండ్రులఁ
గొలిచి తిరుగువాఁడు కొడుక సుమ్మి. 15

క. కనకున్నవారు పున్నము, లను గనరని తెలిపె మున్ను లచ్చిమగం డం
దున నే నేవగ పెంపునఁ, గని పుత్తురు జమునిజాఁడఁ గనకుండెదనో. 16

మ. అని నేమంబున నిల్చి పుత్తురులఁ దా నందంగ లో నెంచి చ
య్యన నాకవ్వపుఁగొండవండ కొకరుం డందండుఁ బెంపొందువా
రిని జేజేజడదారిరాయ లగువారిన్ బమ్మము న్నెమ్మదిన్
గనువారిం గనఁగొంచుఁబోయి యొకచోఁ గాలాఁచె మేలూనుచున్.

ఉ. సొరగుగబ్బిగుబ్బలులఁ జాల్కొనునా సెలయేటిసీళులన్
దీరినగున్న మామిడులఁ దీయనిపల్కులు నల్కలంకులన్
జేరగఁ బల్కుచిల్క లట నేలపడంతుక పాలు చేఁపు రా
వారక కన్నవారి కిడ వారలు కోరిక నాడున ట్లగున్. 18

చ. తమ కగు లేఁజిగుళ్ళు కొఱంతం బడఁ గాయలుఁ బండ్లు పిట్టచా
ల్న మలగఁ జూచి కిన్క మెయి నల్లడ మొట్టుచు మావితోఁపులోఁ
గమరగ ముల్కు లేరకొనఁ గాంతు వొకో యనునట్లు కోయిలల్
గమికొని కూయుఁ గో యనుచుఁ గందుని రమ్మని పిల్చునో యనన్.

మ. పెరవాఁడై తొవకన్నెలం జెరుపనై వేవెల్గుల న్వెల్గుపో
రికిఁ జూడం దగదంచు వెన్నునిమది న్వీక్షించు నప్పంటబి
త్తరి పై మేలిముసుంగు వేసికొనె నా దట్టంబుగా నొండొకం
డొరయం గల్గినతోఁపు లాపొలమునం దొప్పారు నెప్పట్టునన్. 20

వ. అట్టిసోయగంబు గలపున్నెంపుఁగోనలో నొక్కచక్కనితావున. 21

చ. కడుకొని నేమముం దనరఁ గా రయి రాలినయాఁకలంబులేఁ
గుడువక గంతులాడుమదిగుబ్బమునుఁ గక్కలకల్లె మేమొ నా
నడరెడునేర్పునం దిగిచి యాఁగఁగఁ బట్టి కడంకతోడఁ దా
నెడఁద బసిండిబొజ్జఁ గలయేలికఁ గొల్చుచు నిల్చె బత్తిమై. 22

తే. ఇట్లు తబుసులు కొనియాడునట్లు లేండ్లు
పూండ్లుగా బమ్మఁ గొల్చుచుఁ బొనరుచుండు
తఱిని నాముస నామని దాపరించెఁ
బుడమిపై నెట నుండియో వడిగ వచ్చి. 23

వసంతఋతువర్ణనము.

తే. ఏచె మావులు గ్రోవులు నిప్పలుఁ గడుఁ
బూచె మల్లెలు మొల్లలు మోదుగులును
గాచె దానిమ్మనిమ్మలు గన్నెరు లిగు
రాచెఁ జెట్లులు చేమలు నట్టియెడల. 24

ఉ. కమ్మనిమావిపూవులను గాలువఁ గట్టెడు తేనె లాని ఝుం
ఝుమ్మని తేంట్లు పాడెఁ గడుసొం పలరార నిగుళ్ళు మేసి కో
కొమ్మని గండుకోయిలలు గూసెను జిల్కలు గోరువంకలున్
ముమ్మరమైనపండ్లఁ దిని మొత్తముగా వగఁ బల్కె నత్తఱిన్. 25

చ. కొలఁకుల నీటఁ బోటులను గూడుచు వేడుక నాట లాడుచున్
గొలకొల మంచుఁ గూయుచును గోఫులు సూపుచుఁ దమ్మిగద్దెలన్
నిలుచుచు నావులించుచును నిక్కుచు నీల్గుచుఁ ద్రెంచి తూండ్లు ము
క్కుల నెగిరించుచుండి కనుఁగోఁ దగె నంచలు కన్నుఁబండువై. 26

చ. గమగమలాడుతావి గడుఁ గ్రమ్మెడుపున్గు జవాది పచ్చక
ప్రము నునుపచ్చనాఁకుఁబోడి పచ్చికచూరము మల్లెయత్తర
స్గమరుపసిండిగిండి నిడి యంపిగఁ జేసినమంచిచల్వగం
దము మెయినిండ నొండొరులు దాలిచి పొల్పద రాల్మగళ్లొగిన్.

మ. చలువల్ గ్రమ్మెడుపూలపందిరులపజ్జ న్జాజిపూఁదోటలో
మలెపూఁబొన్పునఁ బండియాలు మగఁడున్ మైహోయిమైఁదేల్చుచున్
లలి నేతెంచెడులేఁతపయ్యెరను శేల్పాటించుచు న్నిచ్చలు
న్వాలరావానిదురంబున న్వాలఁతుల్తై నల్వొంది రయ్యామనిన్. 28

మ. చిలుక ల్గోరలు దేంట్లు గోయిలలునుం జీగాబులుం జీల్గులున్
బలగం బెల్లడఁ జుట్టువారుకొన శేవ న్జిల్కుమా వెక్కి రే
పులను న్మాపులుఁ దుంటవింటఁ బువుఁదూఁపు ల్గాచ్చి పూవిల్తుఁ డా
చెలికాఁ డామని తోడు సూప జగముం జెండాడె నయ్యజ్జనన్. 29

చ. మెలిఁ గొని యొండొకం దరయ మిక్కిలి చిక్కఁగ నున్న మావితోఁ
పుల నలవోక మొత్తముగ బుల్గులు గూయఁగఁ బూవుఁదేనియల్
జలజల రాలి నేలపయిఁ జాల్కొన నెమ్మలు చూచి కారుమ
బ్బు లురుముచుం గడుంగురియుఁబో యిపు డన్చమనాడు నత్తఱిన్.

చ. పొలుపుగ నొక్కట న్విరియఁ బూచినమల్లెపొదం గడంగి తేఁ
టులు గలయంగ వ్రాలి యెపుడు న్విడకుండఁగ నొప్పె నప్డు పెం
పలరఁగఁ బెండ్లియాడి యట నామని వెన్నుఁడు తోఁటచచ్చియుం
దొలి కటీరాలు ముత్తెములునుం దలఁబ్రాలుగఁ గొన్నప్రోవనన్. 31

క ఆమనిఁ బొదలెడు సోయగ, మేమని మెచ్చంగ వచ్చు నెంతటివా--
వే మరునిబారి కగ్గల,మై మెలఁగుచుఁ గుతిలఁ గుడువ నల్లు

వ. అట్టి సొగసులకు నెల్లఁ దానకం బగునట్టియామని దీమసంబై నేల
నేలుచున్న యెడ నిక్కపుజగంబున నున్నతమ్మిపుట్టువు తన్ను నమ్మి
యున్నట్టిరాచపట్టిం జేపట్టి ప్రోవ సమకట్టి కట్టెదురం జవులు పుట్టఁ
బాట వాడుచున్నట్టిపూర్వచిత్తి యనునచ్చరమచ్చెకంటిం బొర
పొచ్చెము లేనిముచ్చటం జూచుచుం బిలిచి పని యొసంగించి పంచు
టయు మంచిది యనుచు నాబోటి తోడిబోటులతో నామేటి
యున్నతోట కరుదెంచి చాలునచప్పరంబు లనంజొప్పడునట్టిచెట్టు
నీడలనాడుచుఁ బూఁబొదలందూఱుచుఁ దీఁగయుయ్యాల లూఁగుచుఁ
గేళాకూళు లనంజనునేళులఁ దేలుచుఁ బూలు గోయుచుఁ జివురులం
జిదుముచుఁ బూఁదేనె లానుచుఁ బుప్పొడులం గప్పుకొనుచు నాడుచుం
బాడుచు నుండె నట్టి యెడ. 33

వ న వి హా ర ము

చ. చిలుకలముక్కునొక్కులను జెల్వగుమారెడుపండ్లు సూచి నె
చ్చెలులను గన్మొఱంగి యొకచేడియ వేడుక కోడ వాడ కిం
పలరఁగ నేగి వాని కెనయై తగి యుం దనచన్నుదోయి నొ
క్కులు గనఁగామికి న్వగచెఁ గొంచెము గానివిరాళిఁ దూలుచున్. 34

తే. ఓలి ననుఁ గన్నగోవాళ్ళయుల్ల మిట్టు
లట్టు నిట్టును దూఁగాడు ననుచు నేమొ
గోల యొకతె యుయ్యాల జంపాల యనుచు
లాలిఁ బాడుచుఁ దీఁగయుయ్యాల లూఁగె. 35

మ. చెలులారా ! కనుగొంటిరే చిలుకతేజీరౌతు నో మూనఁ గో
ల్లలుఁగాఁ గోసినపూవులందుఁ బడి యీలా గిప్పు డీతేఁటు లెం
గిలి గాఁ దేనెలు గ్రోలి యేగు నవి కేగెం గాన సంపంగి మొ
గ్గలునుం గేదఁగిపూలు డెం డనియె నొక్క ర్తెల్ల కా నా ననన్. 36

తే. అట్టినెడ యొక్కసకి యొక్కయలరుఁదీవ
గట్టిగ నొకచెట్టునఁ జుట్టఁ బెట్టుకొనఁగఁ

గాంచి తమి నెంచి మైఁ బులకించి మిగుల
వగలఁ బొగిలె మరుఁడ! యిఁక తగ దటంచు. 37

మ. ఒకయీరంబున గండుకోయిల యొకం డొప్పంగఁ గూహూ యటం
చొకమా రార్చిన మిండగీ నొకని న ప్పల్లంబున న్నిల్పి మే
నొక యింతైన నెఱుంగకున్నవలా యొక్కత్రతం డంచుఁ బొం
దిక నోహో యని యేగఁ జొచ్చె నటకున్ మేలంబు సేయం జెలుల్.

మ. చెలియా! యామని తీవకూనలకునుం జెల్వొందు లేమావిగు
న్నలకుం గూరిమిఁ బెండ్లిచేసి యిదె చెంతం బొల్చుగొజ్జంగిపూ
పులలోఁ బుజ్జవ మారఁ దేటుల కిడున్ బోనంబుఁ బూజంపుబం
తులు సాఁగించుచుఁ జూడు మం చొకత యెంతో సంతసంబందెడున్.

మ. పొదరింటం బువుఁదేనె లానుకొనుచున్ బుప్పొళ్లపైఁ గప్పుకొం
చుఁ దగం జేడియ లొంటొరు ల్వాడల నచ్చోఁ బచ్చవిల్తుండు హె
చ్చొదవ న్మాదుజగంబుల న్గెలువఁగా నుంకించి వాలమ్ములన్
బదనుం బెట్టఁగ జాపాడిం గలయఁ బైఁ బైఁ బూసెనో నాఁ దగెన్.

వ. ఇట్లు కడుదెఱంగుల వేడుక నాటలాడు నచ్చరచేడెల యొయ్యారంపు నడలం గదలుకమ్మలుం గాజులుం గడియంబులున్ సూడిగంబులున్ రవలయొడ్డాణంబులు న్మెట్టె లందియలు లోనగురవణంబులచప్పుళ్ళ నప్పుడుఁ దెలసి యప్పుడమితేఁ డల్లనఁ గన్ను విచ్చి చూచునంతలో నయ్యింతులచెంత నెంతయు సంతసమ్మునఁ దుమ్మెదకొమ్మయుం బలెఁ బువ్వుతావి మూరుకొనుచు సింగారంపునడకలకోపులచేతను నేపు చూపువగల చూపులచేతను దీటగునాటపాటలచేతను వాట మగు మేటిమాటలచేతను జేజేజడదారులనేని మరుబారిం బడవేయుచుఁ దన మోముదమ్మిం గ్రమ్ముకొనుతుమ్మెదల దిమ్ముల కోపక వడివడి నడచుటంజేసి తడఁబడునడుగులు గలపూర్వచిత్తి కన్నుఁబండువుసేయుటయు నొడలెఱుంగ కతండు తనడెందంబున. 41

సీ. కనుపండువై మదిఁ గరఁచుచుండెడు నిది
పొంగారుబంగారుబొమ్మ యేమొ
బంగారుబొమ్మ కీపసతావి గల్గునే
పసిమించుజాజిపూబంతి యేమొ
జాజిపూబంతి కీసరితళ్కు గల్గునే
సరిక్రొత్తమెఱపులజంట యేమొ
మెఱపులజంట కీమెలఁకువ గల్గునే
చెలరేగుమరునిరాచిలుక యేమొ
తే. మరునిరాచిల్క కీచిన్నె లరయఁ గలవె
యలరునలరువిల్తునిపువ్వుములికి యేమొ
యెసఁగుపువ్వుముల్కి కీవన్నె లెన్నఁ గలవె
కోర్కెలీడేర్చుముద్దులగుమ్మ యేమొ. 42

ఉ. ముద్దులగుమ్మయే నిజము పోలిచిచూచినఁ దోఁచెఁ దీనిమే
నద్దిర జాళువాపసిఁడియా? మెఱుఁగారు మెఱుంగు గుంపులో
నిద్దఁపుజోతియా? యనుచు నెమ్మది సందియ మందఁ జేయునీ
ముద్దియ నెట్టిమంచిపనిముట్టులఁ జేసెనొ బమ్మ నేర్పునన్. 43

స్త్రీ వర్ణనము

తే. జాళువాపైడిపొడియు జేజేలబువ్వఁ
బదనుగా గల్పి దాన నిప్పడఁతిఁ జేసి
నలువ మెఱుఁగున మెఱుఁగిడె నలర నిట్లు
కావయే నిట్టిసొగ సెట్లు కలుఁగు నహహా. 44

చ. తలకక మమ్ము రే త్పెఱచుదాయను గెల్చియ వానిచుట్టలం
మెలపితి మంటి కొల్చి మన మీరును దొల్లిఁటిబామునందు మా
తలఁ బడినా రటం చడుగుఁదమ్ము లనం గని మ్రొక్క వచ్చునో
వెలయఁగఁ దేం ట్లనం దగియె విప్పినయీసకిసోఁగపెన్నెరుల్. 45

చ. మొగ మలచందురుం గరఁగి పోసిన తాత యొనర్చె నంచు మున్
దగిలి జగంబులో నుడువ దబ్బర యం చనుకొంటి మార! చ
క్కఁగ నెల యయ్యెఁ డాసి కనఁ గానియెడన్ మనకన్నుఁగల్వ లిం
పుగ విడ నేటికి న్నిజము బొం కరయం గదఁ దేటతెల్ల మా. 46

ఉ. పూవిలుకానివిండ్లు సుమి పోలిచి చూడఁగ దీనికన్బొమల్
కావునఁ జూపుటమ్ము లిటు గాటముగా మెయిమీఁద వ్రాలి యెం
తేవడి డెందముం బగుల నిట్లొనరింపఁ గడంక వోఁగ మై
చేవఁ దొఱంగి యుంటి నగుచేఁతలు దక్కి విరాళిఁ దూలుచున్. 47

తే. కోడెకాండ్రమములు వట్టఁ గోరి మరుఁడు
పన్నియుంచినవల చుమీ కన్నెకురులు
గానఁ బెళుకుబేడిస లన నైనకన్ను
లేగుఁ గాఁబోలు జానుఁగులాఁగ లంట. 48

క. పున్నమచందురుఁడగు నీ,కన్నియనెమ్మోము బొట్టుకం దగు నగవన్
వెన్నెలలు గాయు నెల్లర,కన్నుంగలువలును విచ్చి కడుసిరి నలరున్.

క. చినిపూఁదేనెయుఁ బానక,మును బాలుం బంచదారపాడియున్ మఱి తీ
యనివానిఁగూర్చి పగడం,బున మెఱుగిడిచేసెనలువ పాలఁతుక పెదవిన్.

క. పువ్విలుతుఁ డీఁదఁ గలిగెడు, జవ్వన మనునేరెడేటఁ జనుతరగలు నా
నెవ్వలనఁ జూడ నొప్పెడు,జవ్వనినునుఁగడుపుమీఁదసవ్వరై ముడుతల్.

మ. మునుమే నియ్యది వెన్కమే నివి యనం బొల్పొంద నారెంటిసం
దున నేర్పాటుగ బొడ్డుబా ట్టిడఁగఁ దోడ్తో నెంచి కల్గించువే
ల్పనయం ద్రాడునఁ జుట్టి తూఁచె నట నెంతే నొత్తుటన్ సన్నమై
చనునాఁ బొల్చె నెలంతకౌను గనుఁగో సక్కెంబుగా కేరికిన్. 52

తే. మేటితమ్ములతోడనో లేటచివురు
గములతోడనో కడుఁ బోరఁ గలుగునట్టి
ఝాసుతోఁ బుట్టె నాఁగ నీయింతియడుగు
లరయఁగా నొప్పుఁ దొగరుచాయలను గనుచు. 53

ఉ. ఈనడ లీయొయారములు నీసొగ సీబలునీటు లీబెడం
గీనెఱిచూపు లీవగలు నీపస లీతగునేర్పు లీసొరం
బీనగుమోము నీతళుకు లీపెనువన్నెలు చిన్నె లెన్నఁగా
నీనవలాక చెల్లు నిదియే మరునేలెడిబోఁటి గాఁ దగున్. 54

వ. అని తనమదిలోనం గోర్కి దైవాఱఁ గైవారంబు సేయుచుఁ జెఱకు
విలుకాని విరికోలలతాఁకులకుం దాళఁ జాలక లేచి దానికరంగటకుం
జని యిట్లనియె. 55

రాజర్షి పూర్వచిత్తితో సంభాషించుట.

మ. వెలఁదీ! యెవ్వరిదాన వెవ్వతెవు నీపే రేమి యెందుండి యీ
పొలఁతుల్ గొల్వఁగ వచ్చితీ వలరు నిప్పొదోఁటకు న్మేటివై
వలఱేనిం గికురించివచ్చురతివో వాఁ డంప నిందున్నవా
రల నేచం జనుదెంచుపూముల్లికివో రా రమ్మ వాకి మ్మొగిన్. 56

వ. అని పలుదెఱంగులఁ బలికిన నప్పలుకులు విని పైకి లేనికినుకం గనఁ
బఱచుచు నక్కలికి మెలఁకువం జంకించుచు ని ట్లనియె. 57

శా. ఏమేమీ! మునిముచ్చువా? తెలిసె నీయీగోఁచివేసంబు నీ
నేమంబున్ జడదారి వంచు వెఱ వో నీచెంగట న్నిల్తు మి
ట్లే మేరో మఱిమాగ్గనంబుకత యె ట్లెట్లో మదిం జూడ కే
మైమాట ల్పచరించి వేఁడుకొన నీమై నిబ్బరం బొప్పునే. 58

[illegible]. బలుతపసి వంట నాఁకల,ములఁ బొట్టం బోసికొనుచు మొగిఁగాఱడవిన్
మెలఁగుదు వంట సొగసుక,త్తెలఁ గని మరుబారిఁ జిక్కి తెగి తంటబలే.

మ. విను మాయచ్చరమచ్చెకంటుల తెగల్ వెగ్గొందుచు న్నేర్పు పెం
పున నిం పుప్పతిలంగఁ బాడుటలు గోపుల్మీఱఁగా నాడుటల్
ననవిల్కాఁ డతఁ డొజ్జగా నెఱిఁగి నానాఁటన్ జగం బెల్ల గె
ల్చినమే మీనినుఁ దెల్పి నల్వ కెటుగాఁ జేయింతుమో చూడుమా.

వ. అని గద్దరించి పలికిన దద్దఱిల కతం డమ్ముద్దియ యొద్దకు నొద్దిక
మీఱం జని నిద్ద మగుతనసుద్దుల బుద్దిపుట్టించిన నదియు నట్టెపనిక

మెట్టుచున్నయది గావున దానికి నియ్యకొని యతని యిచ్చవచ్చిన
మచ్చున మెలంగె. అతండు నయ్యచ్చరమచ్చెకంటెం గూడి యాడి
వీడునకుం జని వేడుకలం దేలి తేలి నాభిలోనగు కొడుకుల నేఁటేఁటి
కొక్కనిఁగఁ దొమ్మండ్రం గని నూఱువేలయేండ్లు పంటవలంతి నేలి
నాభికిం బుడమిబరువు గట్టిపెట్టి పూర్వచిత్తితో నిక్కఁపుజగంబున
కరిగె పదంపడి. 61

నాభివృత్తాంతము.

తే. అల్లపొక్కిలిపేరిరాయుండు గడఁగి
జాళువాకొండకూఁతు రై గ్రాలుమేరు
దేవి దేవేరిఁ గాఁ గొని తీవిమీఱ
నెన్నియే నేండ్లు నెమ్మిమై నేలెఁ బుడమి. 62

వ. ఆనాభియునుం గొడుకులం బడయఁ జాలక పసిఁడిదువ్వాలువదాలుఁ
గొలుచు నట్టిమేటిజన్నంబు వట్టి మెలంగుటయు నంత నాదేవరయు.

సీ. జేజేలరాతాల జిగిడీల్పఁ జాలుమై
పొంబట్టుచెంగెంబు డంబుమీఱ
నునుఁబోరఁ గౌస్తుభ మనుమానికపుఁబేరు
మొయిలఁ గాన్మెఱుఁగునా మొనయుచుండఁ
సెంగేలఁ దలకట్టు సింగాణి వలమురి
గుదుసువాల్గుదెయును గొమరుమిగుల
నెలమి దేవేరులై కలిమిలేమయు నీల
యును నేలచామయుఁ దనరఁ గొలువ

తే. నెల్లవేల్పులుఁ దబుసులు నెఱఁగుచుండఁ
గరువలిని దూరువడి గలగరుడి నెక్కి
కొడుకులకుఁ దన్నుఁ గొలిచెదుపుడమిఱేని
కడకు వేంచేసె మిగులనక్కటిక మొప్ప. 64

వ. ఇట్లు పొలిచి నాభిం బిలిచి నీ కేమికావలయు నెఱింగింపు మిచ్చెద
ననిన నతండు బత్తిం దళుకొత్త నతనియడుగులంబడి చాఁగిలి మ్రొక్కి
దేవరా! నీకుఁ బురుడగుబుత్తురు నొసంగు మని వేఁడుటయు నాతండు
నాకు బురుడు నేన కాని మఱి యొక్కరుండు లేఁడు కాన మీకు నేను
గొమరుండనై పుట్టఁ గల నని పలికి నెనరుఁ జూపుచుం జూపులకుం
జూపట్ట కెట కేనియుం బోయె నంత మేరుదేవియు. 65

శా. చూలాలై తగ నీరు మోసి కడురోజుల్ పున్నెముం గూర్చుచు
న్మేలీ పొలగనంబునందుఁ గనియెన్ వెల్గొందుమైవానినిన్
జాలం దేజునఁ దేజరిల్లుమొగము న్జానొందుకన్దోయియున్
గ్రాల న్మద్దులుఁ గుల్కువానిఁ గొమరున్ రాచిన్నె నావెన్నునిన్.

మత్త. అంతఁ బుత్తురుఁ డైనవెన్నుని నల్లపొక్కిలిపేఱిఁ దేఁ
డెంతయేనియు సంతసంబున నెంచి ప్రేముడి కొంతయున్
గొంత బత్తియు నుల్లమం దయి గొప్పగాఁ బెనవేయ నొ
క్కింత నిల్పక యింటఁ బారుల కిచ్చె సొమ్ములు వేనవేల్. 67

తే. తెలుపుడాల్గలమేనును బలిత మైన
బలిమియును జాలఁ దేజునుగలకొమారుఁ
డెలివి నారసి నాభి పేర్వెలయఁ జేసె
బుషభుఁ డనుచును జగ మెల్ల నెఱిఁగికొనఁగ. 68

వ. అంత నాబుషభుండు తెల్లచెక్కజాబిల్లిపగిది నాఁడు నాఁడునుం బెఱిఁగి
పెద్దవాఁడుగా నెఱింగి తండ్రిడి తనబుజంబునం గలనేలబరు వతనిబుజం
బునం బెట్టి పడంతితో నడవుల కరిఁగె నంత బుషభుండును. 69

క. పితరులయట్టులు నెమ్మది,మితి యింతయు లేనినెనరు మీఱఁగఁ బజలన్
సతమును జేకొని విడువక,బ్రతికించుచుఁ బుడమినేలెరాయండగుచున్.

చ. అరయఁగ వెన్నుఁ డాబుషభు డంతట మబ్బులనెక్కు రౌతుచే
నరుదుగ నీయఁగాఁ బడి జయంతి యనంజను కన్నెఁ బెండ్లి యై

భరతుఁడు దొట్టిపుత్త్రుల బాగుగ నూర్వురఁ గాంచె నందు నా
భరతునిపేర నిప్పుడమి భారతవర్షము నాఁ దలిర్చెడున్. 71

వ. ఆ ఋషభుండు పెక్కేండ్లు పుడమియేలి నూఱుజన్నంబులు చేసి యిక్కడిసుకంబు సుకంబుగాదు. అక్కడిసుకంబ సుకం బనియంతయుం దిగఁ ద్రావి తాను జడదారులం జేరువాఁడై యొక్కనాఁడు కొడుకులం జీరి యిట్లనియె. 72

వృషభుండు పుత్త్రులకు నీతు లుపదేశించుట.

తే. కొడుకులార! చిన్నతనంబునడుచు తఱిని
బత్తి నొజ్జలకడఁ జేరి పాటుపడుచు
ననయ మక్కరంబులుగోతె నవువు మీఱ
విద్దె నేర్వఁగ వలయును బుద్ధి గదుర. 73

ఉ. ఒజ్జలె తల్లి దండ్రియును నొజ్జల రాయఁడు వేల్పు నంచు నే
యజ్జున నెంచుచుం దగినయట్టులు కొల్చుచు బత్తి మ్రొక్కుచున్
బజ్జను నిల్చి విద్దెలను బాగుగ నేర్వ నగు న్వాడం దగున్
రజ్జులు కీడు తెక్కలితనంబును నెల్లరతోడిపోరునున్. 74

ఉ. తల్లియుఁ దండ్రి యన్నలును దాతలు మామలు దొట్టిచుట్టలుం
జెల్లిననెయ్యురుం దనకుఁ జెప్పినచొప్పున మెల్గుచుం జగం
బెల్లెడ మంచి వాఁ డనుచు నెన్నఁగ నై వడు గైన పిమ్మటం
డెల్లము మూఁడుసందెలను దేవరఁ గొల్చుచు వార్వఁ గాఁ దగున్.

ఆ. పిదపఁ గొలపుటొజ్జ వినిపింపఁ దొలిమిన్కు
గములు మనువునుడులు గడఁగువిల్లు
విద్దె లోనగు మనవిద్దెల నెఱుఁగంగ
వలయు నడవడికలఁ దెలివిఁ గదుర. 76

చ. కొలమున రూపునన్ పడుచుకొప్పున నేపునఁ జూపునం గొనం
బులఁ దన కీడు జోడయినపొల్తుకఁ బెండిలియాడి జన్నముల్

వెలయఁగఁ జేసి పుత్త్రులవేడుకఁ గాంచి జగంబునందు లే
డలకెపురాయఁ డొండొకరుఁ డం చనునట్లు మెలంగఁగాఁ దగున్. 77

క. పుడమిఁగలతనయుపజలను, గొడుకులఁ బలె నెమ్మినేలుకొని సేర్పలరన్
గడుసరివారలఁ బ్రెగడల,నిడుకొనఁ దగు దనదుచెంత నెకిమీఁనికొగిన్.

చ. చెడుగులఁ జెంతఁ జేకొనినఁ జేఁ కగు నెమ్మదిలో నసం బొగిన్
వెడలెడు చెడ్డపే రగును బిమ్మట గల్గెడు రాచదానియుం
జెడియెడు లచ్చి వాయు మఱి చెప్పన దే మిఁక వానిపొంగొదల్
పుడమిని బాసి పోవుదెసఁ బుట్టక మానునె యెట్టకేవియున్ 79

సీ. తన్ను మించినయట్టిదాయతో నెదిరింపఁ
జన దట్టివానఁ బొం దొనరుప నగుఁ
దనకన్న నలఁతియై తారసించినయేని
గెలిచి వానిసిరులు వలయుఁ గొనఁగఁ
దగునట్టు లునిచినదండుల కెల్ల నొ
క్కదళవాయి వలయు గండుమగఁడు
మనువుమాటలు నేర్చి చనవు మీఱినయట్టి
ప్రెగ్గడనుడియంద పెరుఁగ నగును

తే. చెలఁగఁ దగినట్లువెచ్చంబు సలుపవలయుఁ
గొడుకుబుట్టులకేఁ జను విడఁగఁ జెల్ల
దేడుచెడుగుపనుల నెడ్డ పీడనొప్పఁ
బుడమియేలిక యగువాఁడు కొడుకులార. 80

ఉ. పుత్త్రులార ! యిప్పుడమిఁ బుట్టినమానిసిమూఁక కెల్ల వే
హత్తగఁ జేయుఁ గుక్కలనఁ నబ్బనిపెంగొద లయ్యొ కోర్కు లం
చెత్తఱి మీర లవ్వలని కేగక ప్రోచుచు మంచివారలన్
గత్తరకాండ్రనై పులను గన్గొన కుండుఁడు మంచిదారిగ్మై. 81

వ. ఆటచేడియలు లోనగుచేడియలం దగులుమిండగీండ్రతోడి పొత్తు
కీడున కగుఁ బెద్దలతోడిపొత్తు మేలున కగు నీసునుం జెలిమియుం

జ్ఞాపక దాయలం జుట్టల నొక్కమట్టునం గనుమొత్తనిమది గలవారు పెద్దలు చెడుపను లొనరించువాఁ డెప్పుడునుం గొదలపా లగుమేను లెత్తుచు వెగ డందుచుండుఁ గావున నేవాఁడునుం గోర్కులం గోర రాడు తెలివి యెంతదనుక లేక యుండు నంతదనుక మేను లెత్తు చుండవలయును మేను లెత్తుచున్నంతతడవు నెమ్మది పెక్కుపనులవలనం జిక్కుకొని నెమ్మదియుం దెలివియు లేక యుండు నది గావునఁ జేఁత లెవ్వియుఁ జేయకుండవలయు నెన్నండ నగునాయందు సంతసం బెంతతడవు లేక యుండు నంతదనుక పుట్టుచావులు నొగిలించుచుండుఁ జదివినవాఁడైన నిలు నింటియాబిడం దగిలి వెడఁగై నేను నాయది యనుతలంపున నుండె నేనిఁ జెడిపోవు నది లేకుండి నన్ను బత్తిం జేసి మంచిదారులం జనుచున్నవాఁడు పుట్టి చావనివిడుపు పేరితానకంబు నకుం జని నెమ్మదిం గనుఁ గావున మీరు నన్నె యెన్ననిఁ గా నెఱింగి కై వారంబు సేయుచుండుఁ డెందు నేమర కంతయు నన్నె కా తలం చుట తెలివి యనంబడు దీనివలన నీకనంబడులావుమేను చెడి మాని సికి సుక మగుఁ గన్ను లున్నవాఁడు కానివానికిం దారిఁ జూపునట్లు తెలిసినవాఁడు తెలియనిచెనటికిఁ దారి చూప నగుఁ జూపనట్టి తల్లిఁ దండ్రులు మొదలగుచుట్టంబులు చుట్టంబులు గానివార కాన మీకుఁ దెలిసినదే నీదారిఁ జూపితి నామే నొరులకుం జూడ నరిది పున్నెంపు టొడలు గలనాకుఁ బుట్టినమీ రెల్లరును మీకన్నయుం గొప్పవాఁడు నగుభరతుని నన్న కా చూచి కొలిచి నేల యేలుచుండు డిదియ నాయిచ్చవచ్చిన తెఱం గని మఱియును. 82

తే. ఉసురు గలయట్టివారిలో నెసగుఁ జెట్లు
వానికన్నను బాములు వానికన్నఁ
బసరములు వానికన్న మానిసులు వారి
కన్న దేవళ్లు మఱివారికన్న బమ్మ. 83

తే. అతని కన్నను ముక్కంటి యతనికన్నఁ
బసిఁడిపుట్టంబుఁ దాల్పరి పసఁ జెలంగు
నతఁడు నేల వేల్పులఁ గొల్చు ననుచు నెఱిఁగి
వారిఁ గనుఁ డెల్లరకుఁ బెద్దవా రటంచు. 84

బ్రహ్మానందము

ద్వితీయాశ్వాసము.

క. సిరులకు నెలవగునేలకు, దొరయై దొరలేనినెనరు దొరలఁగఁ బ్రజలం
బరికించి యేలుగంగా, ధరరాయని సూర్యరావు దనరెడు నెపుడున్.

వ. ఆలకింపు మవ్వలికథ శుకుండు పరీక్షితునకుం జెప్పినట్లు సూతుండు
జడదారుల కిట్లనియె. 2

భరతుని చరిత్రము.

చ. తనబుజమందు నీపుడమిఁ దాల్పు మటంచును దండ్రి పెట్టి పో
యినతరువాత నాభరతుఁ డేలికయై ప్రజ మెచ్చునట్లు కూ
ర్పనిగొంద నేలుచుం బాలము రాఁబడిలోపల నార్వపా లొగిన్
దన కగుకప్పముంచుఁ గొని తాఁ బ్రజకై సెల వెన్ని చేసెడున్. 3

క. తమ్ములఁ బ్రేముడిఁ దొంబది, తొమ్మండ్రను దనకుఁ జేతితోడుగఁ గొని తా
నెమ్మెయినెమ్మది నేలె న, సమ్మదికడు బలిసి మూఁడుజగములునిండన్.

తే. తగినప్రెగడలఁ బ్రోడలఁ దనదు చెంత
నిలుపుకొని వారినుడులంద మెలఁగుచు నెపు
డెట్టిగొందలు నేరికి నంటనట్టు పంట
నాటిప్రజఁ గన్నయ ట్లేలె నాతఁ డపుడు. 5

చ. తనర నతండు నేమమున దక్కినపుం దెసనుండి మంచుగ
ట్టున కొకమూఁడును న్నఱకేఁ గడుం దగఁ బడ్మరనుండి తూర్పునై
పున కొకసారెయుం బుడమి పొల్చినదాఁకను జన్న మొప్పగా
నొనరిచె నొక్కఁడానిసుద నొక్కటిగాఁ బగ వైచి సాలలన్. 6

తే. ఆపుడమిఱేనిజన్నములందు నెల్ల
యొడయఁలును వచ్చి రని వేఱ నుడువ నేల?

నేలవేలుపులును నింగివేలుపులును
గూడి సాబంతిఁ గుడిచిరి కోర్కు లలర. 7

ఉ. ఆతఁడు నాలుగుం దెసలయందును గెల్పును గొన్న చిన్నెకై
పాఁతినపొన్నకంబములపట్టున జన్నపుమేటికంబముల్
పాఁతెను గప్ప మిచ్చి కొలువం దొర, లిచ్చలు దీర్ప వేల్పులున్
బాతరలాడుచుం బ్రతతనివాకిటఁ గ్రిక్కిరియంగ నెప్పుడున్. 8

వ. ఆదొరతేగం బెంతనఁ, గాఁదగునో యతని నరయగా వచ్చినయే
పేదయుజక్కలదొరకున్, మాదిరియనఁ జెప్పనొప్పమటియున్మటియున్.

ఆ. విశ్వరూపుఁ డనెడుపేరఁ దలిర్చెడు
సామికూఁతుఁ బంచజని యనంగ
మించుకన్నె మిన్న మంచిలగనమందుఁ
బెండ్లియాడె నతఁడు గొండ్లిమీఱ. 10

చ. గొనములప్రోవతం డెడఁదఁ గోరిక లేకయె కాపురంబునం
దును దగులంబు నొంది తమితోడను గుమ్మరిపుర్వు పొల్చుపొ
ల్పున వెలుగొందుచున్ సుమతి లోనగువారలఁ గాంచె నేవురన్
హనువుగ నల్లపంచజనియం దెద మేలని మెచ్చఁగా దొరల్. 11

తే. తండ్రడు లేలినకరణి నాతండు చేఁత
లన్ని విడువక పంటతొయ్యలిని నేలె
నంతమేటియుఁ దనపేర నపుడు నిపుడు
డంబుమీఱెడు భరతవర్షం బనంగ. 12

క. జన్నములు పెక్కొనర్చియుఁ, బున్నమలమవసలు రాగఁ బోడిమితోనా
వెన్నునకప్పన మంచును, బన్నుగఁ దానగ్గి వేల్చు బత్తి దలిర్పన్. 13

వ. ఇట్లెన్నియేఁ బుడమిపజలు మెచ్చికొనుమంచిపను లొనర్చుచుండాఁ
గన్నకొడుకుకుఱ్ఱల కన్నం గారవంబునఁ బజల నరయుచు నిన్ని యన
రానివే లేండ్లు నేల నేలి తనమది లచ్చుమగనియందుఁ గలియఁ గూర్చి

కొడుకులకుఁ బుడమియెల్లఁ బంచి యిచ్చి లచ్చి కాటపట్టగునిల్లు
వాసి వాసి గలపెద్దల తోనం గొని పయనంబై పులహుం డనుజడదారి
నిలుచునడవికిం జనియె నదియును. 14

పులహాశ్రమవర్ణనము.

క. నేల నగునెల్లకానల, లోలలిఁ గొనియాడఁ దగినలోయలతోడన్
గోలముల కెల్ల నిల్లయి, చాలం జను నల్లకాన జడదారులదై. 15

చ. కులుకున నెగ్గు లేనుఁగులగొంగలు గోరిక నాలు నాలుదిం
డ్లెలుకలు నెల్కగొంటు లోకయింతయు లోనెడ లేక యందునన్
గలజడదారిరాయలకుఁ గల్గినతేజున నొక్కగొంతు గా
నలరెడు నల్లకానఁ గొనియాడఁగ నో ననరాదు బమ్మకున్. 16

మ. నడిరేదాఁ కలకానలోనఁ గడుఁ జెన్నారఁగ జేజేనుడు
ల్కలచక్కిం జడదారిపుత్తురులు వల్కంగా నెడం గొంకులన్
లలి నెంతే నిదురించుచున్నయెడనైనం జాగరం బేగుదేఁ
జిలుకల్ గోరలు దిద్దు నున్నటులు జేజే లెన్నఁగా నొజ్జలై. 17

క. జడదారిరాయ సెలల, క్కడ జన్నము లూని యునికిగా నుండుటచేఁ
గడుకొని స్రామినుకులుగ, ల్గడు తావనిపొగడఁగాఁదగెన్ జగమందున్. 18

తే. పొనర హరివాణముల నిల్పి పూజఁ జేయఁ
దగినజా లెందు తండోపతండములుగ
నుండి యాడుచు నుండు నాగండకి యను
వాఁక యక్కానయం దొగిఁ బాఱుచుండు. 19

క. ఆపులహమునికిపట్టున, బాపనరేఱేండ్లఁ గూడి భరతుఁడు మదిలో
నీపగిది యంచు నుడువఁగ, నోపని కడుబత్తివెన్ను నుడుగక కొలుచున్.

వ. మఱియు నతం డన్నియుం బెడఁబాసి యొండేమి యెఱుంగక బత్తిం
దగిలి సంతసంబున మేను చెమరించి గగుర్పొడువ నల్లనయ్య నుల్లం
బునం దిడుకొని నేమంబున నిరాబారియై తబమ్ము గావించుచు ని
ట్లుండ్రఁ గొన్నియేండ్ల కొక్కనాఁడు. 21

భరతుఁడు గండకిలో లేడిపిల్లం బట్టి పెంచుట.

ఉ. గండకి నాఁగఁ బేరునను గ్రాలెడువాఁకకు నేగి యొక్కచో
మెండగుబత్తి నాడి తనమేనియస ల్వీడనాడి నీటిలో
రెండుగడె ల్మునింగి యమరెం దొలిపుక్కల కెద్ది తొల్లియై
యొం డగునట్టియక్కరము నొయ్యనఁ బల్కుచు నుండె నంతలోన్. 22

మ. పొసరం జాల్కొని నీరుమోయుచు నెలల్ మూఁడాఱుగాఁ గుత్తుకు
త్తనుచు న్మెట్టుచు నెట్టకేలకును నీ రానంగ నవ్యేటికిన్
జనుఁదెంచెం గడునాస జింకనవలా చాలంగ నొకాఱుపెం
డను నో రెండఁగఁ జేయునట్టిదగతోడన్ రెండుజాల్పొద్దునన్. 23

తే. వచ్చి డిగి నీరు ద్రావుచో నచ్చొటి కొక
యింతదవ్వుల మెకముల నేలుమేటి
పాటి యింతనరానట్టిపగిది మొగసి
బొబ్బరించె దెస ల్మాఱు మ్రోసికొనఁగ. 24

చ. అది చెవులందుఁ బెద్దపిడుగట్లు పడం గడు బీతు జెందియు
న్బెదరియు బెగ్గడిల్లియును నివ్వెఱపాటును ఱిచ్చపాటునుం
గదిరియు నల్లలేడి వడి గాడుపుతండ్రిని ముట్ట లేచి యం
గద గలుగంగ నేటిదరి గట్టుపయిం బడి చచ్చెఁ బాటునన్. 25

తే. ఇట్లు పడునట్టియదనున నిఱ్ఱిచెలికి
కడుపు దిగజారి పూవిలుకానియింటి
తోరివ నీళులఁ బడి బిడ్డ చావకుండ
నాడె దయ్యముకూర్చున నట్టియెడల. 26

చ. భరతుఁడు కన్ను విచ్చి తనప్రక్కన నీళులఁ దేలియాడుచున్
జరిగెడులేడిపిల్ల కని సంతసము న్నెనరుం దలిర్పఁగాఁ
బరుఁగునఁ బోయి పట్టుకొని బందుగు లెవ్వరు లేని దీని నే
నరసినఁ బున్నె మా ననుచు నప్పుడ తోకొని పోయె నుస్కికిన్. 27

క. తోడుకొనిపోయి మిక్కిలి
వేడుకతోఁ బాలు పోసి పెంచుచు దానిం
గూడి పెఱపనులు విడిచియు
నాడుకొనుచు నిలిచె భరతుఁ డదియే పనిగాన్. 28

శా. నీట న్మున్గుట సందె వార్చుట తటి స్నిర్వాపలో వేల్చుటల్
గూటంబుం బెడఁ బాపుఁబున్నెపుగతల్ లో నెంచుట ల్గోల నా
పాటింపం దగుమంచికర్జములునుం బ్రాల్మాలి పోకార్చె నా
నీటం బట్టినలేటిపిల్లకొఱకై నేమంపురాయం డొగిన్. 29

క. గారాబంబున నట్టులు
గోరికమెయిఁ బెంప లేడికూనయు నానాఁ
డేరికిని నింపు గూరెడు
తీరున మే నొప్పఁ బెఱిఁగెఁ దే జలరంగన్. 30

తే. కఱఁగి పోసినబంగారుకరణి దాని
నిగనిగలు వొల్చి నలుగడఁ దగులుకొనుచుఁ
గదియ వచ్చినయెల్లరకన్నుఁగవకుఁ
బొల మదెల్లను పచ్చ యన్పొలుపు గొలుపు. 31

ఉ. సోయగ మేర్పడ న్నిలిచి చూచుచు మేనుఁ గదల్పకున్నచోఁ
బాయక చెంతఁ జేరి కనువారును నిక్క మెఱుంగ లేక మేల్
చాయ నెసంగుసొన్నమున సల్పినరూపిది ముట్టియుం గనుం
దోయియు వేల్పురాఱవలతో నగు నంచుఁ దలంతు రెంతయున్. 32

ఆ. మూడుకాళ్ళ నిలిచి మోమటు మరలించి
వెనుకకాలిగొరిజ వెసఁ దగిల్చి
కన్నుఁ గోఁకికొనెడుకడునేర్పు గాంచినఁ
గనులపండు వగును గాదె పజకు. 33

ఆ. కోడెకాడు మిండగీడు నయినవాఁడు
సొగసుకత్తె తనదుసోయగంబుఁ

గనెడునప్డు దానికనుచూపునకుఁ జొక్క
కరణిఁ జొక్క దానికనుల జగము. 34

వ. ఆగాచదబిసియు నిట్లారుముద్దుగ నున్న నాయిఱ్ఱిపిల్లఁ దనయునికి పట్టునం బెట్టుకొని యెడతెగనికనికరంబునఁ గూరుచుండెడునపుడును బండుకొనెడునెడనను నీ రానెడునదనునను బూలు బత్తిరిఁ బండ్లనుం దెచ్చునజ్జునను వేళ్ళులం గొలుచుతఱిని దనయొద్దన నునుచుకొనుచుఁ బులి సింగం బెలుఁగు తోడే లేడిక లోనగునడవిమెకంబులవలనిబీతునఁ బొలంబుల వెనువెంటం దిరుగులాడుచుఁ గొంతదనుక బుజంబుల నెక్కించుకొని మోయుచు మఱికొంతసేపు తొడలమీఁదం గూరుచుండం బెట్టుకొని ముద్దులాడుచు నొక్కింతతడ వక్కునం జేర్చుకొని సంతసించుచు నదియ పనిగా నుండి నిచ్చలునుం జేయుచేఁత లందదుకులుగా నెడనెడ లేచి చూచుచుఁ బెక్కేండ్లు బ్రదుకు మని దీవించుచు నంతలపొంతల దనక చెంతఁ జేర్చుకొని మిక్కిలి చెలిమిం జేసి యక్కఱగండఁడై యాఁకలంబులును దుంపతూండ్లును గడ్డికసరులును బాలునీళ్ళునుం బోసి పెంచుచుండె నట్లంటసిల్లి పెరుగుచున్న యాజింకపిల్ల యొక్కనాఁ డేరెకినిం గానరాకుండఁ గిరురించి చౌఁకళించి యెటయే నూడనింబాడె నంత నాతండు దానినెంతయేఁ దడ వబ్బాలాడుచు నెమకియుం గాన కక్కిలిపడి తన్నుఁ బెడఁబాసిపోకకు మిగులవగలం బొగులుచు దాని నెడఁదం దలంచుచు నిట్లని పలవించె.

భరతుఁడు లేడిపిల్లం గానక పరితపించుట.

మ. అకటా ! నాచిటిపాప ! నన్విడిచి నీ వడ్డింతలే కేగితే
మొకమాటంబును బాసితే యడవి నేమోసంబును జెందితే
యొకలోయం బడి దారి తప్పితె మెకం బున్నట్టిచో టంటితే
సెకలోఁ జొచ్చితె పచ్చిక ల్మెసవుచున్ జెర్లాడుచు న్నిల్చితే. 36

మ. తగ నీరానెడునప్డు బొబ్బమొక మొద్దన్ బొబ్బరింపంగ లో
వెగడుం జెంది కడిందినై నెగిఱి నిన్వే నీటిలో నూడ్చియుం

దెగటాఱెం దరిగట్టుమీఁదఁ బడుట న్నీతల్లి తా నక్కటా
తెగి నీపాటులఁ జూడ దయ్యో నది నాదే బాద యయ్యెం గదే. 37

శా. నీటన్ బడ్డపుఁ డీవు చచ్చితివ యేని న్నేవుగా నాకు నీ
పాటుల్ కన్నొకయింతమూసికొని నేఁ బ్రాల్మాలి యప్డంటనే
నేటన్ వాలుగఁ బోయి తోఁపవు గదా యింతేని లో జాలి లే
కోటం చుంటిన యేనిఁ జేకొనుచు నిన్నోమం గదా బొట్టెరో. 38

క. వదవదలాడెడుమే న
య్యేదనునఁ బుట్టమునఁ దుడిచి యఱకడఁ గొని నేఁ
బదిలముగ నిన్ను సాఁకుచు
గోదలంటక యరయుచుంట గోడయ్యె సయో. 39

ఉ. కన్నులు ముక్కుమూసికొని కా ల్గదలింపక నేమ మంది నే
నున్నెడఁ జిన్నికొమ్ముకొన నొయ్యనఁ గోఁకుచు మేను నాఁకుచుం
గన్నులు మోము మూర్కొనుచుఁ గాళ్ళపయిం దల వెట్టి పండుచున్
న న్నెపు డంటి యుండునిను నాతరమే పెడఁబాసి యుండుటల్. 40

ఉ. తీరిచి రేక కాటుకను దిద్దినముద్దియకన్నుఁ దోయికిన్
మేరకు మీఱుపోల్కెఁ గొని మించి తలిర్చెడు నీదుకన్గవన్
సారెకు వెన్కకాలిగొరిజం దగ గోఁకెడునేర్పు పెంపునన్
సౌరును నెమ్మదిం దలఁపఁ జాల దిగుల్గొని కుంద కుందునే. 41

వ. అనుచు నక్కజం బగువిరాళి నెక్కొన నక్కలిపడి తుద కంబేదయై
మిగుల వగలం బొగులుచు మఱియును. 42

సీ. అలికి ముగ్గులువెట్టునలవేల్పుటరుఁగుపై
నెలమిఁ బన్నుండువా రెవ్వ రింక
నగ్గుల వేల్వంగ నమరించుతెల్లులే
యిగురులు గొరుకువా రెవ్వ రింక
సామ్ములఁ బూజింప సంతరించినపూల
నెసఁగి మూర్కొనెడువా రెవ్వ రింక

జేజేల దానంబు సేయింపఁ దెచ్చిన
యింపునీ రానువా రెవ్వ రింక

తే. నేలికకు నారగింపు సేయింపక మును
బువ్వ బుక్కెడు మెక్కువా రెవ్వ రింక
నెపుడు నను ముద్దుగుడుపువా రెవ్వ రింక
నీవు విడనాడి పోయినయింతలోన. 43

ఉ. ఎక్కడ నుంటె నానిసువ! యిక్కడ నాపని యేమి చేసి నీ
వెక్కడి కేగితీవె మఱి యేమిగొందంబడి వేగుచుంటివే
పక్కనఁ బోయి కోలుపులివాచవి మైతివె నవ్వటాలకీ
చక్కన దాఁగియుండి కొనసాఁగితె లోఁగితె యేమి మైతివే. 44

తె. తల్లిదండ్రులు లేనట్టిపిల్ల యనుచుఁ
మిగులనక్కటికం బెదఁ దగులఁ దగిలి
నడిచి మేకముఁలదాడినిఁ బడఁగ నీక
పెంచునను విడనాడితే పేరిమ లేక. 45

తె. నాదు పెంపుడుకూన! న న్గా దటంచు
జెదరి పోయితె నే నేమి చేయువాఁడ
నెటులు గనుగొందు వెండి ని న్నిటులు వాసి
యొడలియుసురులు విడక యెట్లుందు వాఁడ. 46

వ. అని పలువెఱంగులఁ బలవించుచు నతం డుల్లంబున మిగుల నారాటంబు జెంది నేను దబమున నున్న యెడ నన్నుఁ గొమ్ముల గోఁకుచుండునట్టిగొనంబు లే నెన్నఁడు గందునో? నే నించుక కసరినం గని కొమరుండు బలె నెడఁ జని నిలిచి పిలిచిన మఱియు వచ్చి వెనుక నిలిచి యుండునట్టిమెలఁకువలు గలదాని నెప్పుడు చూతునో? యది యెప్పుడు వచ్చి నన్ను నంతసపఱచునో? లేడి త్రొక్కినచేల జన్నంబుల కగు నను టంజేసి యీతోట వెంతపున్నెముం చేసికొన్నవో? జాబిల్లి యట్లు

నేను నీతల్లిలేనిపిల్లం బెనిచినం బున్నెం బని చేకొంటి నట్టినే నిట్టియి
కక్కట్టులఁబొంద వలసె నక్కటా!దయ్యమా!యని దానిపైఁ గలతమ
కంబునఁ జాల విరాళిం దూలుచుఁ దనతబంబంతయుం జెడ జడనువడి
యుండె నంత నొక్కింతసేపున కాజింకబుడుత చనుదెంచి గాచతబిసి
కన్నుంగవకుం బొడకట్టుటయు నతండు పోయినసొమ్ము వెండియుం
జేకొన్నవానిం బలె మిగుల సంతసించుచు దానిం జేర నరిగి మోరం
బట్టి ముద్దుపెట్టుకొనుచు మేనెల్ల నిమురుచు సిరంబు మూరుకొనుచు
సందిటం జేర్చుకొని యిట్లనియె. 47

భరతుఁడు లేడిపిల్లను గాంచి సంతసించుట.

మ. అకటా ! నాచిటిపాప! నన్విడిచి నీ వత్రాడు చెచ్చోటికిన్
మొకమోటంబును బాసిపోయితివో యీప్రొద్దింతసే పీవు నా
దుకనుందోయికిఁ గానరామి నును రెంతో తల్లడం బంది మే
నికిఁ గాకుండగఁ బోవునట్టిదగుచు న్వేఁగించెఁ జుమ్మీ ననున్. 48
మ. జలకం బాడఁగ లేదు సంజయును బెల్చ న్వార్వగా లేదు రే
పులు మాపు ల్దగ వేల్వ లేదు కరివేల్పు న్గొల్వఁగా లేదు నీ
ఖులును న్దార్పఁగ లేదు నిద్దుర ది యెట్లోచూడఁగా లే దయో
యొలకూనా ! నను వీడ నాడి యెటనో యీ వున్న యీయింతలోన్.
ఆ. కంటఁ బడినవారిఁ గంటిరే నాబిడ్డ
ననుచు నడిగి యడిగి యడవు లెల్లఁ
దిరిగి తిరిగి యెందు నరయ నోపక పెల్లు
తల్లడిల్లనైతి తల్లికాన. 50
క. నినుఁ గాననట్టిబెంగం, గొని యుల్లము తల్లడిల్ల గుండెలు పడకై
ఫెనుజాయి దాపినట్టులు, కనవచ్చెన్ నాదులోనికడు పోబిడ్డా. 51
ఆ. కంటఁ బడితి నాదుకడ తేఱఁగా నున్న
యుసురు కుదుటఁ బడియె మిసిమిఁ గంటి

మంటి పసిఁడికొండ యింటఁ జేరినయట్లు
లోఁ దలంచుచుంటి నాదుసూన. 52

వ. అని మిగుల వగలం బొగలుచుఁ దానంబును సంజయును దబంబును
లోనగునన్నియును విడిచి దానితోడం గూడిమాడి యుండెనని
శుకుండు వెండియును. 53

మ. తగులంబుల్ బెడఁబాపుఁ బున్నె మనుచున్ దా నాతఁ డల్లప్డు బం
దుగుల న్నెయ్యుర నిల్లు వాకిళులునుం దోరంపురాలచ్చియున్
దగునేల న్విడనాడి బోడి యగుచుం దాల్ అప్పలుం జెట్లు చే
మగముల్ గల్గినకాన మెట్టుచుఁ గటా! మా నీగెఁ గన్గొంటివే. 54

మ. ఇలు నిల్లాలును బుత్తురుల్ జగమునం దెవ్వారికి న్వండి బా
ముల నెత్తింపఁ బునాదు లంచు విడి యాబూతంబు బూతంబు నాఁ
దలఁప న్జెరిఁ లేడిపిల్లచెలిమిం దా జీంద్రమం దెంతయే
గలఁగె న్వింటివె? బమ్మవ్రాలు తుడువం గాఁ జాలునే యెవ్వఁడున్.

ఆ. ఎంతవారి కైన నెకిమీఁడులకు నైన
వెన్నదొంగ కైన వేల్పుఁదబిసి
కైన నొసలివ్రాఁత కన్న లే దన్న వో
నెఱుఁగ మానిసు లన నెంతవారు. 56

మ. ఎకిమీఁడా! విను మంత నల్లభరతుం డేం డ్లెన్నియే నట్లు కా
నక వేగించుచు నొక్కనాఁడు తనకుం జావంగ నొచొప్పు కొం
చక యేతెంచినజాడఁ గాంచి మదిలోఁ జాలంగ నారాట మొం
ది కడున్ జేరువ నున్నజింకబుడుతన్ దేర్వారఁగాఁ జూచుచుం. 57

తే. ఓసి! నసుఁ గన్నబిడ్డ! ని న్బాసి పోక
వచ్చెఁ దలమీఁద జేనంత వఱలు మిత్తి
చావు నిక్కంబు కటకటా! చేవ లేని
యీ విఁ కెట్టులు బ్రదికెదవే తలంప. 58

భరతుఁడు లేడికడుపునం బుట్టి విచారించుట.

మ. అని దానిం దలపోసి పోసి మదిలో నారాటముల్ హెచ్చ వి
చ్చినకన్నుంగవ నిట్టిఁ జూచికొనుచున్ జీకాకునుం జెంది చి
క్కనగాఁ గుత్తుకలోనఁ గట్టె మెలఁగంగా గుఱ్ఱు రెట్టింపఁ జ
ల్లని యొంటూర్పున నుండి కొంతవడి కెల్లం జెందె బెన్నిద్దురన్. 59

ఉ. కండెను గాజు వాతెను మొగంబు కనుంగవ కంగులో యనం
గ్రిందికిఁ బోయె బావవలెఁ గ్రిఁగడు పయ్యెను మూయ రాక నోర్
కండక మున్ను కానఁ బడెఁ గాళ్ళును చేతులుఁ గొయ్య లయ్యె మే
నందుగుమ్రాఁకు నా బిగిసె నాతనిలో నుసు రేగినంతటన్. 60

క. ఆరాచతబిసిపీనుఁగు, నారయ బీతెలుఁగనట్టిఁడైన వడంకుల్
గోరికఁ గని తనలోనం, జేరుచుకో నంటరానిజేజే కగునో. 61

వ. ఇట్లు పీనుం గై యతండు పడియుండినంత. 62

చ. ఉసురొదలి న్వడిన్ విడిచి యుప్పరపీదికిఁ బోవునప్పు డా
నిసువును నెమ్మది న్నిలిపి నెయ్యము పెంపున నుండెఁ గాన న
ప్పస చెడియున్న తేఁడు కడుఁబాటులపాలయి పోవ వెండియుం
గసవును మెక్క నిట్టి యయి కస్తికిఁ బుట్టెను దొంటితెల్వితోన్. 63

చ. కడుపున నున్నయప్డు తనకాళ్లను జేతులు మే న్గదల్ప రా
కడగొనఁ బ్రేవులుం బొరలు నంతటఁ జుట్టుకొనంగ కుళ్ళువిట్టులోఁ
బడి కడు నెమ్మ లొత్త వెతపాలయి యుట్టినిసుంగు తెల్విమెం
గడువడి బమ్మరిల్లెఁ దనకర్జముచేఁతకుఁ దల్లడిల్లుచున్. 64

తే. తల్లికడుపున నున్నప్డు దారసిల్లు
వారి కాబొజ్జలోనుండి కారు మచుచు
నేడ్చునట్లును గటకటా యెంతవంత
యనెడునట్లును వినవచ్చు నచ్చెరువుగ. 65

చ. వెనుకటిబాములందుఁ గటివేల్పును గొల్చినవాఁడు గాన నం
దున నపు డిట్టిమై పాడమి తోరపుఁ దెల్విని బాముకుండి లో

ననయము నట్టబాము తన కప్పుడు కల్గుట కెంతయేనియుఁ
గనలుచుఁ బిమ్మటం బడుచుఁ గాఱియ నొందుచు నేడ్చుచుండెఁబో.

ఆ. తల్లి పాలుగుడుపఁ దారసించిన ముట్టె
పొడుగుచెంతఁ బెట్టి కొడుగుఁ గాని
కడుపు నిండఁ బాలు గుడువ నొల్లదు వెన్నుఁ
దలఁచు చోడలు మరచి నిలిచెఁ గాన. 67

మ. కడుపు ల్గట్టి కొలంబుసాములు గడున్ గారాబ మేపారఁ బెం
బొదలందు న్బొలమందు మెట్టుకొనుచుఁ బోవంగ నాజింక పెం
పు దలిర్ప న్నడయాడ దంటి కనవు న్మ్మార్కోఁడు కార్కొన్న పెం
ద్దది కోలుంబులి కాంద్రము కాంద్రము మని రాఁదాఁ బారిపో నెంచదున్. 68

సీ. వడి మెట్ట దడు గెటఁ బడి చీమ చచ్చునో
యనుబీతునను బాలమండు నెపుడుఁ
గసవు మేయదు దాని కుసురుగల్గెడు నది
తలఁ ద్రెంప నెంత యేడ్చెడునో యనుచుఁ
దెలిచి నీ రాన దేచిఱుచేప నోటిలోఁ
బడి నల్గునో యని వెడఁదవగను
జేలదరికిఁ బోదు రాలి యెన్నులగింజ
లలకాపరికిఁ జెడు గగు నటంచుఁ

తే. దనదుకతమున నేటి కెత్తఱని గొదలు
కలుఁగకుండఁగ నెండుటాఁకులును నెండు
గడ్డియను మేసి యిన్నినీ ళ్ళడ్డి త్రావి
బ్రదుకు నేవగించుచుఁ దనబాముస కది. 69

సీ. తెఱనోటిమొకముల కిఱ వైనబలునీర
ముల కేగు నొకమాటు తలఁకు మాని
తనవారితోఁ గొండకొన కేగి తిరుగుచు
నుంకించి పదు క్రింద కొక్కమాఱు

పెనుదారి దారసించినవాఁకనడుమ నీఁ
దక యుండు నొకసారి తల మునుఁగఁగ
నడవి నల్లడల నేర్చెదుకార్చిచ్చులో
నొగిఁ జొచ్చి పొరలాడు నొక్కతేప
తే. తీఁగ కుత్తుక కుఱిగాఁగ నూఁగులాడు
నొక్కపరి పసరంబుమే నూడి పోవ
జింక యగునట్టిభరతుఁ డేవంకనైనఁ
జేటు వచ్చునె కుడు వెల్లఁ జెల్లకుండ. 70

క. ఇప్పగిదిఁ గొన్ని యేడులు,ముప్పిఁడిఁగొన్నట్టివంత మునుఁగుచుఁదొలిబా
మప్పటితెలివిని నొకనాఁ,డొప్పుగఁ దనబాముగురిచి యుల్లమునందున్.
వ. మిగుల వగలం బొగలుచు నిట్లని పలవింపం దొడంగె. 72

మ. దొర తెల్లన్ దొర వంచు మెచ్చుకొనఁ గాఁ దొరంపులచ్చిన్ జగం
బరయ న్వేల్పులతేనితోడఁ బురుఁడై యప్పుండి పెన్నెలకున్
దొరలం జేసి కొమాళ్ళనుం దబును లేత్రోవం దగం జేరి రా
నిర వత్తోటగ నుండి రాతబిసినై యి ట్లైతిఁ గా దయ్యమా. 73

క. జింకం బెంచినకతమున, గొంకక నాతబము నేటఁ గొట్టుకొనిచనెన్
బొంకక సెడి యిటు లైతిన,యింకిట నే నేమి యగుదు నెఱుగం గట్టా.
ఉ. ఏటికి నేటికి న్మనుఁగ నేగితి నేటికి నీట నుంటి నే
నేటికి లేటిపిల్లఁ గని యింపునఁ బట్టితిఁ బుట్టె నంచు న
ష్టేటికిఁ బెంచినాఁడ మఱి యేటికి మాటికిఁ బ్రేముడింతు నిం
కేటికి నెవ్వగం బొగల నేదియుఁ దప్ప దట్టిమేటికిన్. 75

వ. అని మఱియు నా కాలేడిపిల్లకతన నిట్టిబా మెత్తి బాములం బడఁ
గల్గె విడుపుపేరితానకంబు దూరం బయ్యెఁ గదా! యని యంగ
లార్చుచు నొక్కనాఁడు తన్నుఁ గన్నతల్లిం బాసి యొకెడ తొల్లింటి
పులహాను కిల్లగునల్లతోఁటకుం బోయి యం దామే నూడిపోవ

నుపము నెమకుచుఁ బున్నెమిచ్చు నచ్చం బగునాయేటినీటఁ గ్రుంకు
లిడుచు నిచ్చలుం బాడిచెడి ప్రొద్దున శెట్టియెదుట సాఁగిలఁ బడి
మ్రొక్కుచు వాలుఁబండ్లు కొమ్ములకొనలం గ్రుచ్చి తెచ్చి జడదా
రులకడఁ బెట్టి కొలుచుచుఁ గొమ్ముకొనల వారిమేనికండూతిం
బాపుచు నుల్లంబున నెల్లవేల్పులకును మ్రొక్కి లిడికొనుచుఁ గడు
నేమంబున నుండె నంత. 76

లేళ్ళ కుమ్ములాట.

చ. అడవుల వేటకాఁ డొకరుఁ డల్లికఁ బెంపుమెజింక కొమ్ములన్
వెడఁ దగిలించి వెంటఁ గొని వేటకు మెట్టుచు నిట్టునట్టుతన్
జడనుపడ న్నడల్ దిరుగ సాఁగెను నాభరతుండు సాఁగఁ బో
ల్చెడుచిరుజింకఁ జూచి తనజింకను బోనుసి కొల్పెఁ గొల్పెరన్. 77

చ. అదియును గొమ్ములం గలుగునల్లికతో పడి నేగుదెంచి మో
మది యొకయోరఁ జేసికొని యక్కడ నేలనుఁ గాళ్ళ దువ్వుచున్
గొదుగక ముట్టె ముట్టెయునుఁ గొల్పుచుఁ గొమ్ములఁ గ్రుమ్ములాడి య
య్యాదనున గొం తుగిం బడఁగ నచ్చిఱుజింకనుఁ లాఁగె నీడ్చుచున్. 78

మ. పొగరుం జెందినవేటయిట్టి తనకొమ్ముంజిక్కుముం గుత్తుకన్
దగులం బెవ్వడి నీడ్చుచుండెడుతఱిం దబ్బిబ్బునుం జెంది యా
బిగువుం దప్పినవెట్టియిట్టి పుడమి న్స్విరంబునుం జేవ లే
క గుభుల్లంచును సద్దుగాఁ బడియె మే ల్లగ్గెం గడా యుం చొగిన్. 79

మ. పడి దయ్యంబుఁ దలంచుచున్ దనకు మే న్నాయంగ నౌనజ్జువ
చ్చెడు నంచుం గడుసంతసించుచు మదిం జేడ్పాటు లేదా బళీ
కడగం డ్లింకిటఁ దీఱె నేను విడుపుం గంచు న్నరే షేలు మే
లడియాస ల్దగఁ బండఁ జేసె నిట నాహా! వెన్నుఁ డం చున్న చోన్. 80

ఉ. బట్టను చప్పుడు లొప్పెడు బాఁకులజోకగ నున్న జాలపై
జిట్టును బుస్సు మంచుఁ గడఁ జేవమెయిం గొని గండుకొన్నయా

యిట్టె వడి న్వడి న్గడిమి నీడ్చుచుం బోవుడు మేనినెత్తురుల్
జట్టని కాళ్ళు జారి పడులాగునఁ గాలువ గట్టె నయ్యెడన్. 81

ఆ. తొలుత మేనితోలు తుకతుకత్రై పోయెఁ
గారె నల్ల కండకండలుగను
బుడమి నెమ్ములెల్లఁ బొడిపొడియై రాలె
నిట్టి నిట్టి యూడ్చు చేగుతటిని. 82

క. ఆయంగలార్పునంబడి, పాయక యున్నట్టిజింక పలుతెఱగుల నా
నాయది యంతయు మే లని,యే యుండెను గాని వగవ దంతేని మదిన్

తే. ఇంచు క్కాత్రము పడినపై నెంతయేని
సుకము గలిగెడుననుమాట చొప్పు డెలసి
యెఱుకఁ గలిగినజింక లో నేల వగచు
మగనితో నగ్గిఁ బడుసతి వగచికొనునె. 84

వ. అట్లు చియ్యఁబట్టి కావరంబున నున్న గండుటిట్టె యీడ్చుకొని పోవం
బోవ ముంగల గండకిరేఱు దారిఁ దారసించినం గని యాజింక తేఁ
డాయేఱు పున్నె మిచ్చుం దాన ముగితి గందు నని గిజగిజం గింజు
కొని తన్నుకొనుచుం బెనుఁగులాఁడి నీటం బడి కొట్టుకొనుచు నసు
వులం బాసె నప్పు డావేఁటకాఁ డరుగుదెంచి యుచ్చు విచ్చి నేలంబడి
పొరలాడుటం బాడుపడ డై పనికిమాలినయాబొందె నందునన విడ
నాడి యెటయేనియుం బోయె ననినఁ బుడమితేఁడు దబిసితేనిం జూచి
యి ట్లనియె. 85

మ. జడదారీ! భరతుండు జింకయొకలిం జాలించి తర్వాత న
వ్విడుపుం బేరిటితాన మందెనో కడు న్వివాహ్నాణముం బాపుని
ప్పుడమి న్వొండియుఁ బుట్టెనో తెలుపుమీ పోలించి నే నాలకిం
చెడు నిచ్చుం దగి యుంటి నాఁగ ననియెం జెన్నారఁగా నాతఁడున్.

క. పుడమిదొరా! మెకపుటొడల్
విడనాడి యతండు ముగితి వెలుఁగక మఱియున్

బుడమిం బొాలుకోలంబునఁ
బడి కడుఁ బడరానిపాట్లు పడియె న్విపుమా.

ఆంగిరసుఁడను బ్రాహ్మణుని వృత్తాంతము.

తే. మున్ను కలఁ డాంగిరసుఁ డనుపుడమివేల్పు
వేల్పులను జన్నముల మెక్కఁ బెట్టినట్టి
మేటి సోమాసి తగఁ దొలిమున్నుఁగముల
నరసి తబ మొనరించెడునట్టివాఁడు.

సీ. నడిరేయి యగుదాక విడువక చట్టుల
వల్లె వేయించి ప్రాఁబలుకు వెల్ల
వెన్నునిఁ దలపోసి వెడనిద్దురం జేసి
వేఁకువజామున వేగ లేచి
పదివేసములసామి మదిలోనఁ దలఁచి య
త్తఱిఁ గర్జములు దీర్చి తగినమాడ్కి
నిసుఁగులతోఁ గూడి నెఱిమీఱ నేటికిన్
జని యందు నీరాడి సందె వార్చి

తే. తొలిమినుకుతల్లి నెదలోనఁ దలఁచి తలఁచి
వెన్నవలకన్ను నేటికోల్వైన్ని చేసి
యింటి కరుదెంచి యగ్గుల నెఱిగి వేల్చి
యాంగిరసుఁ డిట్లు నిచ్చ లెసంగుచుండు.

క. అచ్చంపుగోనంబులచే, నిచ్చలు బజ లెల్ల మెచ్చ నెమ్మి మేం
జచ్చువడనతఁడు మెలఁగెడు,విచ్చలవిడిఁదిరుఁగమదిఁ విడువక కడి

తే. అతని కిద్దఱు పెండ్లము లందుఁ బెద్ద
గరితయందును దొమ్మండ్రఁ బరఁగుఁగొడుకు
కుఱ్ఱలును జిన్నసకియందు కూఁతు నొకతెఁ
గాంచి పుడమిఁ గాపుర మొనరించు నతఁడు.

వ. ఇట్లాజన్నిగట్టు కాపురంబు సేయుచున్నయప్పుడు. 92

మ. బరువై తోఁచినజింకమేను విడి బాపం బైనతర్వాతనే
పరికింపం గడతేఱు బాము లనుచుం బాటించి లో నెంచి యా
భరతుం డంతటఁ బున్నియంపుగనియై బాగొందుచున్నట్టియాం
గిరసుం గూడినచిన్నచేడెకడు పన్కెల్పట్టెలోఁ జెరెఁ గా. 93

చ. కడుపున నున్నయప్డు తనకల్గినబాములఁ గూర్చి యెంతయే
నడలుచు దేవరా! యనుచు నాత్రముఁ జెందుచుఁ దొల్లి తా నొగిన్
వెడఁ గయి చేసినట్టి పదివేలకు మించిన చెడ్డచేఁతలం
దడవుచుఁ దిట్టుకొంచుఁ దనుఁ దా నిసి యం చతఁ డుండె నయ్యెడన్.

ఆ. జడనుపడినబుద్ధి గలిగినకొమరుండు
కడుపులోనఁ జొచ్చి కడఁగుఁ గాన
నంచనడలచెలియ కాతడి నెంతయు
నడలు జడనువడియె నాఁడునాఁట. 95

క. తెలివి యనుదివ్వెతేజున, వెలుగొందెడుకొడుకు లోన వెలసినకతనన్
నెలఁతకు నొడ లయ్యెడలం, దళదళ మనుజోతి నల రెఁ దగఁ బరికింపన్.

క. సిడుపడు జాబిలిఁ బట్టి, న్వెడలెడునో యనెడు వెడఁద వెలుపునఁ బోలెన్
గడుకొనియారేర్పడ్వన, ప్పుడు వెలవెలఁ బాఱెమోముపొలఁతికిమిగులన్.

తే. వెలఁదిమిన్నపాలిండ్లకుఁ బిరుదులకును
నడుమ నుండి లే దన నొప్పు నడుము మిగులఁ
బ్రబలెఁ గలవారినిర్వురఁ బట్టి నెనరు
వడసి చనుబీద జగమునఁ బ్రబలు టరుదె. 98

మ. కలదో లేదో యటన్న సందియమునన్ గన్పట్టు లేఁగౌను మి
క్కిలియై తోఁచెను జన్మొనల్ గఱజిగిం గేరు న్నడ ల్విన్నవై
యలరె న్మోమది వెల్లనయ్యె మెఱుఁగై యారొప్పె మ న్మెక్కుటల్
గలిగె న్మాటికి నూర్పు లగ్గలముతై కాన్పించె న ప్డింతికిన్. 99

ఆ. లేవఁ గూరుచున్న లేవనీనట్టులు
పెరుగుచున్నయట్టి పెద్దకడుపు
చెలఁగ మోసి మోసి నెలలు తొమ్మిది గాఁగఁ
గనియెఁ గొడుకుకుఱ్ఱఁ గలికిమిన్న. 100

బ్రాహ్మణ జన్మము.

చ. నెఱి లగనంబునం బోషమి నిద్దఁపుజోతిని వెల్గుచున్నయ
చ్చిఱుతను మంత్రసాని తనచేసురియం దగ బొడ్డు గోసి పో
గరితలు లాల వోసి వెనుకం బొడితోఁ బొగ వేసి యుయ్యెలన్
బఱచిన మెత్తల న్నిలిపి పాటలు దీటుగఁ బాడి రూఁచుచున్. 101

చ. పురికొని జుమ్మురంచు నొకపు ర్వది యెన్నెమ వచ్చి చెక్కిళుల్
కరకఱి నొక్కి చంపికొనుఁ గందు నటంచు వెర న్మఱి న్మఱిన్
బఱపుచు నల్గుచెట్టుకత బాపనికూఁతురు మాలపెండ్ల మం
చరగడె కర్వదాఱుపరు లాడుచు నుండ్రు నెలంత లత్తఱిన్. 102

ఆ. గాలి దూలి సోకి కందు సెడక యుండఁ
జల్లి బూఁదె వేళ్ళు వెల్లకులును
నూఱి పొగలు వేసి నోములు నోపించి
పురిటినాళ్ళు పదియుఁ బోకడంచి. 103

క. మఱిబారసాల నొనరిచి, భరతుం డని పేరుపెట్టి బంగరువున నాం
గిరసుండు పాలు పెదవులఁ,బరఁగం దగులించెఁ దానుబఁడతుకతోడన్.

వ. మఱియునుం గలపండువులెల్లఁ గావించుచుఁ దల్లిదండ్రులు దమబందు
గులపిండుతో మెండుకొనుసంతసంబున నిండుకొని యుండి రంత.105

శా. కన్నుల్విచ్చి కనందు గిల్లు లిడినం గార్కార్మనం దుగ్గునుం
జన్నుంబా లిడఁ బోవ నావనఁ దొగి న్గాల్సేతు లాడింపఁ డే
సన్న ల్సాపిన నవ్వఁ డెప్పుడును ఊచందంబునం బందు లో
వెన్నుం జూచుచు నుండెఁ గానఁ గడుతెల్విం బుట్టునప్పట్టియున్.106

చ. నిసువును గాలి సోకె నని నేర్పునఁ జేతుల రచ్చఁ గట్టియున్
బసుపును మేనఁ జల్లియును మందులు ద్రాఁకులు నూఱి పోసియున్
విసువక చేయరానియవి వేలను జేసియుఁ దల్లిదండ్రు ల
ద్దెస వితయైనవారయిరి దేవరచెయ్వుల కబ్బ ముందునే. 107

వ. ఇట్లుండియు నబ్బుడుతండెట్లో యొక్కచందంబునం బెఱిఁగి పెద్దవాఁడై.

బాల్యవర్ణనము.

సీ. విద్దెంబు లొనరించుఁ బ్రొద్దుకంటిని నిల్చి
కొలుచుట లనుచును దలఁచుకొనుచు
దప్పటడుగులు వేయుఁ దరిగట్టుదారికి
వలఁగొనుటలు నాకుఁ గలిగె ననుచు
నత్త తాత యటంచు నాడు నల్లనివేల్పుఁ
గై వార మొనరించుకరణి యనుచు
బొమ్మలఁ గొనియాడుఁ గమ్మవిల్తునితండ్రి
కగురూపు లన్ని చేఁ దగిలె ననుచు

తే. అతని నెప్పుడుఁ దలఁచుచు నతనియందె
తనదు నెమ్మది యంతయుఁ దగులుకొలిపి
తెలివి గలుగుటఁ దొంటిబాములను దెలిసి
బీతుఁ గొను బత్తుఁ డగుఁ గానఁ బెరిమ నతఁడు. 109

క. తల్లీ! యని దండ్రీ! యని, తెల్లముగాఁ బిలుచు వారిఁ దేలింపంగా
నుల్లంబున జగములకని,యల్లనఁ దొలిదొల్తననుచు నాభరతుఁడొగిన్.

ఆ. సంగడీండ్లు చిఱుత లంగడి నాటల
నాడఁ బిలువ నాతఁ డాడ నిలక
నక్కటకట వీర లడుగునఁ బురుపుల
నలఁగఁ ద్రొక్కుదు గని తొలఁగి పోవు. 111

ఆ. ఓనమాలు తండ్రి యొయ్యన వ్రాయింప
నొజ్జకడను జదువ నంప నతఁడు

జడనువడినవానిచందంబుఁ దోఁపఁగఁ
జదువఁ డన్ని తోల్లి జతన మగుట. 112

వ. మఱియు నిట్లు పిచ్చియుఁ జెవుడును మూఁగయుం గ్రుడ్డియుం గలిగి జడనువడినవానిమాదిరిం జూపుచు జడభరతుం డనియెడు పిరుదు పేరుం గాంచి కించుసంచునఁబెద్దమొద్దు మొఱడు తెఱంగున నున్నను గన్నవాఁడు గాన నాంగిరసుండు ప్రేముడిం బెంచుచు జన్నిగట్టులకుం జేయనగునట్టిచేఁత లన్నియు వరుసతోడ నడపించి వడుగుం జేసి నడవడికలనేర్పు గదుర విద్దెలం గఱపుచువచ్చిన నిచ్చలే కుండియుం దంద్రియానతి నన్నియుం గఱచి కైకొని యతండు విను నట్లు తల తోడం గూడినతొలిమినుకులతల్లి నేమంబున నుడువుచుఁ దొల్లి వచ్చినవాఁ డైన మఱియుఁ దొల్లింటిపలుకుల వల్లెవేయుచు నగ్గుల వేల్చుచు వేల్పులం గొల్చుచుఁ దల్లిదంద్రుల సంతసవెల్లిం దేల్చుచుండె ననిన విని తరువాత కత చెప్పు మని జడదారులు సూతు నడుగుటయును. 113

ఆశ్వాసాంతము.

మ. ఎటఁ జూడం దనపేరు తేజ ననమే యింపొందున గ్లొంచి య
క్కటికం బేర్పడఁ బేదలన్ మనుచుచుం గావించుచుం గోర్కు లెం
తటికైనం దగి నేల నేలఁ గడుజాణం డైనమారావువేం
కటసూర్యుండు పిఠాపురంబుదొర వేడ్కం దేలి మే లందుతన్. 114

గద్యము.

ఇది శ్రీ మహామహోపాధ్యాయ, కలాప్రపూర్ణ, కవిరాజ,
కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి
ప్రణీతంబయిన బ్రహ్మానంద మను
నచ్చతెలుఁగు ప్రబంధంబున
ద్వితీయాశ్వాసము

బ్రహ్మానందము

తృతీయాశ్వాసము.

క. సిరి గలరావుకొలంబున, గరగరికం బొడమిపుడమికలికికి దొరయై
పరఁగుకుమారమహీపతి,కరమరు దగుపేర్మితో జగంబునఁ దనరున్. 1

వ. ఆలకింపు మవ్వలికత శుకుండు పరీక్షితునకుం జెప్పినట్లు సూతుండు జడదారుల కిట్లని చెప్పం దొడంగె. 2

మ. వెడఁ గయ్యు న్నవుడు గ్గైనపిమ్మటఁ గడున్ విన్నాణ మావిద్దెలున్
నడవళ్లుం దగ నేర్చి యట్లు తమకుం గాటంబుగా సంతసం
బడరింపం దలిదండ్రు లక్కొడుకునం దల్లప్పు చాలంగఁ బ్రే
ముడి బెట్టింపఁగ నుండి రింటిపను లాముంబుత్తురు ల్దీర్పఁగన్. 3

ఆ. ఇటులు కొన్నినాళ్లు లెసక మెసఁగ నాంగి
రసుఁడు నతనిసకియు నసము మీఱఁ
గన్నకొడుకు లూడిగము సేయ నుండియు
నునికిఁ బాసి చనిరి యొక్కనాఁడు. 4

భరతుఁడు విరాగియై యింటిపనులను తీర్చుట.

వ. ఇట్లు కన్నవా రడవుల కరిఁగినవెనుక నిల్లు చక్కఁ బెట్టుకొనుచున్న సవతితల్లికొడుకు లెల్లరు నీసున నాభరతుని విద్దెలం జదువ నీయక యింటిపనులయందు నిలుపుటయు నతఁ డెప్పటిం యట్ల వెంబరవిత్తు వలె నై మెలంగుచుఁ దమవారు చెప్పినవియెల్ల నేమరక చేయుచు నిలుఁ దీర్చుచుండె నప్పుడు. 5

సీ. వేఁగునప్పుడు లేచి బాగుగ నిల్లు వాఁ
కిల్లు వీదులు నూడ్చి నీళ్ళు చల్లి

యరుఁగులు గుమ్మము లఱలు నుద్దికిఁ బెండ
నలికి ముగ్గులు పెట్టి పొలుపు మీఱ
బోలెలు చెంబులు ముంతలు వెలిచియు
నిల్లువట్టినపాచినీళ్ళు మోసి
మడిదోవతు లుదికి పడినన్ని మడినీళ్లు
వడసి యెల్లరకును వంటఁ జేసి
తే. వెనుక నెంగిళ్లు లెత్తి బల్పేడఁ జేసి
వడ్లు దంచి పిండి విసిరి పప్పు చేసి
సంజదివ్వెలపనిఁ దీర్చి సరగ వండి
యాడపనులు చేయు గెడప కతఁడు గడఁగి. 6
సీ. దూడకులపాల్పిండి తోడి మేపుకొని వచ్చి
పుల్లెలు గుట్టి గొడ్డళ్ల వంట
కట్టెలు గొట్టి నాగలి దున్ని గుద్దలిఁ
ద్రవ్వి పొలము దొడ్డిఁ దనరఁ జేసి
కూరగాయలచెట్లు గొలిపి గనిమ లెల్ల
మునుఁగ నీటను జేతిమోట లాఁగి
చేలఁ గలుపుఁ దీసి నాలుగుపెడలను
వెలుఁగు చక్కఁగఁ బెట్టి పిట్ట గాఁచి
తే. తను బవలు రేయి గడి యేని గునుక కిల్లు
పొలము నరసి కాపాడుచు మొనసి యున్న
పనులు నన్నలయానతిఁ బాటుపడుచు
సలుపు నిచ్చలు రెక్కసిచంద మమర. 7
వ. ఇట్లింతం డెడతెగక యింటిపనులయందు మెలంగుచుఁ చేతకానిరెండు కాళ్ళుపసరంబు లగువారిచేఁ బిచ్చివాఁడు వెట్టివాఁడు గ్రుడ్డివాఁడు జడ్డివాఁడు నని పిలువం బడుచు నందులకుం దగినపలుకులం బలు

కుచు మంచిచెడ్డ లగుతినుబడుల నాలికకు సరిచవులఁ దలంచి మెస
వుచు నెందున నించుక ప్రేముడి సేయక మెలంగుచు లోపల నెష
తెగనిసంతసంబున వెలుపలి వన్నియుం బనికిమాలిని వని తెగడుచు
నేను నాయది యనునది చెందక యెండకు వానకివమునకు నోడి
పైఁ జీర గప్పక గొప్పయెద్దుబలె బలిసియు మెత్తని గానిమేను గలిగి
నేలం బండి దుమ్మునం గప్పఁబడినమంచిమానికంబు పోలికం గను
బడనిబమ్మ తేజు గలవాఁడై మైలచింపి మొలం జుట్టి మసిపాత లగు
జన్నిదంబులఁ దాల్చి జడునుపడినవానివలె నుండి తమవారు పొలము
పనులయం దుంచిన నందు గిడుమేళ్ళు హెచ్చుకుందు లెఱుంగ
కుండి యుముక తవుడు తెలికపిండి పొట్టు నిప్పటి మాడు డబ్బెడ
లోనుగాఁ గలయవి జేజేలబువ్వపగిదిం దలంచి కుడుచుచు నిలిచి
యుండె నట్టియెడ. 8

చ. ఉడవిపొలంబునందుఁ దమయన్నలపంపున జొన్నచేను తా
నెడపక పిట్టఁ గాచి ఘట లింటిపను ల్నెఱవేర్పఁ బోయి రే
నడి యగునప్డు వెండియుఁ గన న్మొయిఁ జింపియు లేక మోడులా
గడ రెడు మంచునందు నసి నారయవచ్చుచు నుండు నిచ్చలున్. 9

వ. అప్పు డొకనాఁటిరేయి. 10

భరతుని దుష్టజంతువులు హింసింపఁ బోవుట.

మ. ఒకచో బెబ్బులి డాఁగియుండి వడిగా నొక్కంజమై వచ్చి వా
నికి వెన్కం జెయిపట్టి యీడ్చుకొనుచున్ రెం డంగ వేయంగఁ బో
యి కడుం గాలినయుక్కుతుండుబలెనై యింపొందుమైచేవ నా
గక కోఁజల్ వడి రాలఁ గూలఁబడి వెన్కం జచ్చెనో నాఁ దగెన్.11

తే. కట్టెలకు నేగ నడవిలోఁ గాఱుచోర
వడిగఁ జనుదెంచి పడఁదొబ్బి యడుగున నొక
కాలు ద్రొక్కి తొండమునఁ బై కాలు వట్టి
యతనిఁ జీల్పఁ బోఁ దెగెఁ దొండ మడరుబలిమి. 12

ఆ. కాఱుదున్న తనదుకోరకొమ్ములఁ గానఁ
దిరుగువానిమేను దెఱలఁ బొడిచి
చెవులపిల్లి యనుచుఁ జెప్పంగ నగునట్లు
బోడి దయ్యె వాఁడి పోడుము లఱె. 13

ఆ. కారుకోన నొక్కకాఱుఎలుఁగు వానిఁ
గాంచి బొబొబో యంచుఁ గలియఁ బడఁగ
వచ్చి బమ్మతేజు చిచ్చు నాఁ దోఁపఁగ
వెఱచి పఱచె వెనుక వెనుక దారి. 14

క. త్రాఁ చొకఁడు వానిమీఁగా, లేచినపగఁ గఱచి కోఱలెల్లం దుల్లన్
వేచట్టు నడిన కై వడిఁ, దోఁచె న్దనలోనియుసురు తొలఁగినదానన్.

వ. ఇట్లు దయ్యంబుచెయ్వు పెంపున నేయడవిమెకంబులకున్ జడియక
తొల్లింటిజొన్నచేను రేఁబవలు విడువక కావలియుండు నెడ నొక్క
నాఁడు. 16

భరతుని సత్తికి బలి యియ్యఁబోవుట.

ఆ. కలఁడు వీటియందు బలిజకొలంబున
కొడయఁ డటఁ బటేలు వడి గలాఁడు
సిరులఁ జాల జెంది చెలఁగువాఁ డెప్పుడు
పాడిపంటఁ గలిఁగి ప్రబలునొకఁడు. 17

ఉ. ప్రోలిపటే లతండుఁ గడుపోడిమిమై సిరు లంది యుండియుం
జాలఁగ బిడ్డలం బడయఁ జాలమి నొవలవంత గుందుచున్
వేలుపు లడ్డుపెట్టి రట వేయగుచేతుల సత్తిఁ గొల్చినన్
మే లగు నంచు నూరికడ మించినకోవెల కొక్కరాతిరిఁ. 18

క. చని నేమంబున సత్తిం, గొనకొని పూజించి తనకుఁ గొడుకుల నిమ్మం
చనివేఁడిననసెనాయమ,యనుబడసెదుమానిసిబొలియొసఁగుము వేనిన్.

ఉ. ఆపలు కాలకించి మదియం దపు డెంతయు సంతసించి య
క్కాపుకొలంబువాఁడు తనకావలివారలఁ బిల్చి యొక్కఁడే

నోఁపికతోఁడుత న్నెమకి యొక్కనిఁ దోడ్కొని రం డొకింతలో
నే పరికించి మీరు, బాలి యిచ్చెద సత్తికి నేను వేఁడుకన్. 20

క. అని యాన వెట్ట వారలు
పనివిని యొకచోట నొక్కబలుమానిసినిం
గని కొనిపోయెదుతఱి న
య్యానదలఁ గికురించి పఱచె నాతఁడు కడిమిన్. 21

క. వా రారేఁజీఁకటిలోఁ, బాఱెడునాతనిని నెమకి పడయఁగ లే కా
సూరునిబీతునఁ దిరుగుచు,నారసి రొకచోటఁ బాలమునం దాభరతున్.

ఆ. అరసి పట్టి యతని నయ్యారె! యీబాప
నయ్య చియ్యఁ బట్టి యలరు వీనిఁ
జూచి సంతసించుఁ జూ మనయొడయండు
నొడలినల్ల సత్తికడుపు నిండు. 23

వ. అని కులుకుచుం దఱిమి తోడుకొని పోయి తమయేలికకుం బొడ
సూపిన నతం డింతింతనరానిసంతసంబునం బొందెనంత నతనిబంటు లతని
కిం దలయంటిపోసి పసపుపూసి క్రొత్తపుట్టంబులు గట్ట నిచ్చి మేన
గందం బలంది పూలదండలు మెడనిండ వైచి నగలు వెట్టి మంచి
బువ్వం బారగింపం బెట్టి తమలంబుఁ జేయించి మంచియగరుసంపగి
యత్తరుతావి గుబులుకొనం జేసి పెద్దవాయిదంబులతో నూరేగిం
చుచు దేవళంబునకుం దోడుకొని పోయి యెదుటం గూరుచుండం
బెట్టి రపు డక్కాఁపువాఁ డాముగమానిసినెత్తుట సత్తి నలరింపం
దలంచి మంతరంబులు చదువుచుఁ దనచేతికత్తిం దూసి జళిపించుచుం
దల ద్రెవ్వనేయ నుంకించె నంత. 24

భరతుఁడు తనలో సంతసించుట.

చ. తనతలఁ ద్రెవ్వఁ జేయు నని తా నపు డెంచియు నించుకేని బీ
తనునది యెట్టిదో యెఱుఁగ కాభరతుం డెద సంతసించుచున్

గనలక వారలం దనదుగారవపుంజెలు లట్టు లెంచుచుం
గనుఁగవ మూసికొంచు మదిఁ గన్గొనుచుండెఁ గడంక వెన్నునిన్. 25

వ. అంత నాకోఁఱలమ్మయు నెల్లయుసులదాల్పులయందును వేరంబు లేక
చెలిమిం జూపుచు బమ్మం గనునాపుడమివేల్పు తేజుఁ జూడ నరిది
యైనం దనకెట్టుపోయి యెట్టు వచ్చునో యనుబీతున గడగడవడంకుచు
నతని నెడఁజేసి మిగులనీసున హుమ్మనుచు నొక్క కేకవైచి చెడుగువై
పాఱునిం జంపునానాలవజాతి వానిని వానివారినిం బిలువఁ జేరులే
కుండునట్లు జంపి తినుచు నాటలాడుచుండె నని వెండియు. 26

చ. ఒరులసిరుల్ చెడం గొనియు నొడ్లకుఁ గీడొనరించుచుం గరం
బరయక బొంకులాడియును నాత్రముఁ జెందెడువారి దూఱియుక్
గరకటి యైనవాఁడు సిరి గాక తనంతన వేఁగి చచ్చెడున్
దొరఁ గొనివానివంగడమునుం జెడి మ్రగ్గెడు నిక్క మింతయున్. 27

క. ఒకరికి నెపు డెగ్గొనరింపక తనత్రోవం దనుజనువాఁ డేగొద లం
టకసిరులందులఁదూగుచు,సుకముగనూఱేండ్లుబ్రతుకుసొంపుదలిర్పన్.

వ. ఇందుల కక్కాఁపుఱేఁడును భరతుండును దార్కాణం బని మఱియును.

ఉ. అత్తఱి నేలవేల్పు మదియం దట బీతొకయింత లేక వే
కుత్తుకఁ గోయ వచ్చి తను గుంజెడువారలయందు సత్తియం
దొత్తెడుకత్తియందుఁ గడునొప్పెడువెన్నునిరూపు నిల్పి లో
హత్తియ యుండఁ గాని యిసుమతయు నాత్రముఁ జెందఁ డయ్యరే.

వ. అంత నప్పాఱుండు గుడివెలువడి పోయి క్రమ్మఱం దొల్లింటిజొన్న
చేను గాయుచునుండె నట్టియెడఁ గొన్నినాళులు గడచినవెనుక
యొక్కనాఁ డొక్కపుడమిఱేఁడు కపిలునివలన నేను దానైతి నను
తెలివి గలిఁగించుకొనునాసం బల్లకి యెక్కి యతనికడకుం బోవుచుండ
మోఁతగాండ్రు తమయం దొక్కరుండు తెవులుగొంటై నడువఁ జాల
కంటం దెలిసి చేనికడ నున్నభరతునిం బట్టుకొని పోయి వీనిచే

నోయింత మని పట్టి మూపునం బల్లకిదండి వెట్టి తోలి నడపించి
రట్టి మెడ నతండును దన మోపినకోలందిమోయుచు నడువ నప్పల్లకిం
దనకు మిగుల గుదులుపు దగులుటంజేసి పుడమిఱేఁడును. 31

క. కుదుపున నటు నిటు కదలుచుఁ
దుద కందుం బోర్లఁ బడియుఁ దొడిబడి మఱియుం
బదిలముగ లేచి వెండియు
గుదుపున్ సైఁపంగ లేమిఁ గుతిలం బడుచున్. 32

వ. బోయలం జీరి యి ట్లనియె. 33

చ. ఉడుగుడి బెస్తలార నడ యుల్లమునం దళు కింతయేని లే
కడుగున మిట్టుపల్లముల నారయ కిట్టులు మీరు బిట్టుమై
నడచుట మేనికిం గుదుపు నాకెడు నెంతయు నిందు నిల్వఁగా
గడగడలాడుచుంటి నిటు కల్గుట కేమికతంబు చెప్పుఁడీ. 34

వ. అనుటయు నాబోయ లి ట్లని రయ్యా యియ్యది మావలన నైనది
కా దీనాలవవాఁడు మంచిగ మోయ నేరఁడు గావున మేమును నీత
నితోఁ బాటివారము కావలసి వచ్చె ననినం బుడమిఱేఁడు పెద్దలఁ
గొలిచినవాఁ డయ్యును నాగనికినుకం గనకనలాడుచు నెఱుకఁ దప్పిన
వాఁడై నీఱు గప్పిననిప్పువలె నెఱుంగ రానిబమ్మతేజున నొప్పు నా
బాపనయ్యం గని కటకటంబడుచు మేలంబు గా ని ట్లనియె. 35

పతేలు భరతుని జెందనాడుట.

చ. ముదుసలివాఁడ వీవు కనుబొమ్మలవెండ్రుక లెల్లఁ బండె మై
వదవదలాడు చుండె నిటు పల్లకి మోయుట డస్సి తాఁకటన్
బొదలెద వెట్టు తాళుదువు పో నిను నిందులఁ బెట్టి మేము మో
యుదు మిఁక నిల్వు మీ యనుచు నొయ్యన మేలములాడఁజొచ్చినన్.

క. విని విననియట్లు పాఱుఁడు
కనలక మాఱాడ కట్లు కనుమోడ్చి తాఁ

దనదారి నడచుఁ బల్లకి
తనమూఁపున నొరసి మిగుల తబ్బిబ్బిడఁగన్. 37

వ. అంత నాబాపనరతనంబు తనకుం గడపటిది యగునాబామునందు నేను
నాయది వీఁడు నావాఁడు వాఁడు నాసూఁడు ననునవి విడిచి
యచ్చంపు తెలివి మెయి నా బమ్మం గనుచు మాటాడనినేమంబున
నారాయనిపల్లకి మోయుచు నడచుచున్న వెనుకటివలెఁ గుదుపు
గదురు టుడుగకునికింజేసి యీసున నతండు వెండియు ని ట్లనియె. 38

ఉ. చావఁగ మోదెదం బ్రదికి చచ్చినయట్టివెడంగుబోయ నీ
కావర మిట్టులుండినది గా తగు నాదగునాన మీఁటి పో
నీ విటు తప్పుగా నడతు నీచెడుపోఁకలు మాన్పి మంచిగాఁ
బోవఁగ జేయువాఁడ నని మోటుతనంబునఁ బల్కె నల్కమై. 39

వ. అట్లు రాయండ ననుగరువంబున గ్రుడ్డివాఁడై మూఁడుచెడుగొనం
బులఁ బెఱుఁగుచున్నయతనిచెడ్డమాట లాలకించియుఁ గడునోపిక
గలిగి తెలివిచూపున వెలుఁగుచు నిద్దంపుబమ్మరూపై మెల్లబూతం
బులలోన నున్నవాఁడు తానయై యున్నయన్నెలవేల్పు త న్నెఱుం
గక కాఱు లఱచుచున్నయాతేనిం జూచి యి ట్లనియె. 40

ఆ. పుడమితేఁడ నీవు నుడివినదంతయు
నిక్కువం బెడంద నిలిపి చూడ
నెట్టబరువు లైన నీమేనికే గాని
నాకుఁ గలుగ నేర వాకళింపు. 41

వ. మఱియు లావుసన్నంబులు సుకము తెవులులు ముదిమిచావు లీను
పంతసంబులు నిదురమేలుకొలుపులు నేను నాది యనుటలు లోనగు
నన్నియు మేనితోడం బుట్టు దానితోడన పోవుఁ గాని నాకుఁ గలుగ
నేరవు నేన కా దీజగ మంతయుం బ్రదికి చచ్చెడునట్టియదియే గావున
నన్ను వేఱె యనం బనిలేదు. ఇతండొడయుం డీతండు బం టనునది

పలుతెఱంగులపనులవలనంజేసి మేనులకుం గలుఁగుఁగాని యుసురు
లకు లేకయుండు నని వెండియు. 42

భరతుండు ప్రతివచనం బిచ్చుట.

చ. దొరగరువంబున న్నిలిచి తోరముగా నను నీవు దూఱుచుం
గరగరిక న్మెలంగఁ దగుఁ గా యని నిచ్చ యొనర్పఁ బూన ని
త్తఱి వితకాని యింతయిన దానను మే ల్నమకూఱునోటు వే
దుఱయిన నాకడం జవిటితో నగునేలను విత్తు మొల్చునే. 43

వ. అని పలికి యోర్పుగలడెందంబుతో నాజడదారి తొంటిబాములయం
దలిపనులు మిగులుటంజేసి బరువునకు సైఁచి పల్లకి మోయుచుం
దొంటియట్లు జనుచుండె నపు డేఱుకఁ గోరి చనునాదొర డెందంబు
ముడి విచ్చునట్టియతనిపలుకులు విని తనయుల్లంబున. 44

శా. ఔరా! యేమిది వింత యయ్యో! నిటు లే నాడంగ నిం పొప్పఁగా
మాటాడెం గద యీతఁ డెవ్వఁడొకో తా మార్మ్మనితో వచ్చి నా
కాఱుల్ సైచినగొప్పవాఁ డొకఁ డగున్ గాదంటిమా బోయలం
దేరీ యిట్టిరు కల్గిరే యొరులు నే నేమేమి పా ల్గంటినో. 45

పటేలు భరతుని కాళ్ళపైఁ బడి ప్రార్థించుట.

వ. అని దిగ్గన పల్లకి డిగ్గ నుఱికి యప్పుడమిదేవరయడుగులం బడి గరువం
బంతయుం దిగఁ ద్రావి చేతులు జోడించుకొని యి ట్లనియె. 46

శా. అయ్యా! యెవ్వఁడ వీవు? గోఁచియును లే కై నట్టివేసంబుతో
నిర్వ్యాజం జనుచున్నవాఁడ వలమిన్నేర్గాల్పవో వేల్పవో
నెయ్యం బొప్పఁగ నన్నుఁ దేర్చుటకునై నేఁ డిందు జూపట్టునా
నెయ్యుం డొకపిలుండవో తెలిపి నానేరంబు సైరింపవే. 47

చ. ఎఱుఁగక మోఁతలో నిలిపి యెన్నియొ కాఱులు వల్కి దూఱియుఁ
గరకరి దప్పుఁ జేసితిని నాదగునేరము లెంచ కేలు మే
వెఱవను బ్రొద్దుచూల్గుదెకు బెద్దగరంబున కగ్గికిం గరం
బరయఁగఁ బాఱుతిట్టులకు నాత్రముతో వెఱఁ జెందినట్లుగన్. 48

వ. అయ్యా ! నీవు తగులంబు విడిచి జడునివడినవడువున నుండి కప్పు
వడిన తెలివి కలిగి మెలంగుచున్న వాఁడవు నీపలుకులు పెనుమినుకుల
కుం బురుడై తలంచుటకును నుడువుటకును దరంబులు గాక యున్న
యవి నేను గఱివేల్పుపొల్పునం బొడమిన కపిలునికడ బమ్మవిద్దె
తెలియం గోరి చనుచున్న వాఁడ నీవు మాఱురూపున నన్నుఁ బ్రోవ
వచ్చినకపిలుండవు గాఁబోలుదువు వెంబరవిత్తు లగునావంటిగేస్తులు
తపసిరాయలలోనికత లెల్లెఱుంగఁ గలరు నేను హాయఁ దనియెడు
గరువంబున విఱ్ఱవీఁగుచు పెద్దలం దూఱి గోడు మూటఁ గట్టికొంటి
నదినీయక్కటికంపుచూపునం దీఱుగాని యొంటం గాదు. ఎల్లర నొక్క
లాఁగునం జూచుమీ కీసు గలుగ నేరదు. అనదల మగు మాఁబోఁటి
వారిం జెడకుండఁ గాపాడు మనిన భరతుం డతని కిట్లనియె. 49

భరతుఁడు పఱేలునకు నీతులుచెప్పి జ్ఞానోపదేశము చేయుట.

మ. ఒడయండా ! విను పెద్ద లీజగమునున్ హుళ్ళక్కిగాఁ బల్కుచున్
విడుపుం బేరిటితాన మొందుటకునై వేడ్క న్దగం గొందు ఱి
ప్పుడు నీవాడినమాట లెల్లఁ జదివెం బో యీతఁ డన్నట్టివెం
పెడలె న్నీ వన నే ననంగ నెవఁ డే నేల్వాఁడనే నిన్నహో. 50

ఉ. ఈవు దిరంబుగా నిలువ నెంచితివే కద యీజగంబులోఁ
గావున నన్ను నెయ్యమునఁ గావుము సైఁపుము నేర మంచు లోఁ
గావరము దగన్ విడిచి కాళ్ళపయిం బడి వేఁడి తీవు మే
లీ విటుఁ దప్పఁ జేసితివె? యెవ్వరి కెవ్వరు బ్రోచువారునుక్. 51

క. పల్లకి మోయించుట నని, యుల్లంబున నుండఁ బోలు నోహో నీ కేఁ
దొల్లిఁటి చెయ్వులకతమునఁ, బల్లకి మోసితిని నీదుపని యిటుఁగలదే.

క. కను గానక తొలిబాముల, నొనరించినవెల్ల వెనుక నొందఁగఁ దగు ని
ట్లన నొప్పఁగాని చేయిం,పను జేయంజాణయొకఁడుపరఁగునె చెప్పుమా.

వ. అని పలికి యూరకున్న వెఱఁ గంది యగ్గోఁచిపాతరాయనికి దండంబు
పెట్టి యూరాయండు మఱియు నిట్లనియె. 54

మ. తెగులుం జెందుటఁ గుందుమానిసికి నెంతే మందు చందంబునన్
దగచే మిక్కిలివేఁగువారలకు నెన్నం జల్లనీ రట్లు పెం
పుగ నౌనీసను పెద్దపాముకఅవన్ బొ ల్పేది యున్నట్టినా
కౌగి నీప ల్కనుమంతరంబు తగనై యొప్పించె నోదేవరా. 55

ఆ. నన్నుఁ గన్నతండ్రి నాసందియము లెల్ల
నిన్ను నడిగి తెలియ నున్నవాఁడఁ
దనరఁ జెప్పు నేను దానై తి ననిమొదు
దారి నెనరుఁ దోపఁ దపసిరాయ. 56

వ. అనిన నతం డతనిం జూచి రాయా! నీవు రాయఁడ వను గరువంబు
నం బల్లకు లెక్కి తిరుగుచుండుటయె కాని యెప్పుడుం బెద్దలపేరోల
గంబులం దిరిగి నేర్చి యుండినవాఁడవు గావు. ఎల్లయుసురుదాల్పుల
పిండునకున్ మనికి యగునీజగంబు బూటకంబున నొనరింపంబడియె
నిది నిక్కంబై యుండునది కా దని వెండియు. 57

తే. పుడమి నీవులచే నింటఁ బొసఁగుఁబనుల
వలన నెల నగ్గి ప్రొద్దులఁ గొలుపుచేతఁ
బ్రాఁబలుకులచే నెందుచే బమ్మ మరయఁ
దగదు పెద్దలఁ గొల్చినఁ దగినయట్లు. 58

క. ఓజమెయి నెపుడు పెద్దలఁ
బూజించుచు మంచిదారిఁ బోయెడువాఁ డా
తేజునఁ బొలిచెడువిహాపుం
దాఁ జను నని ప్రాఁబలుకులతలలే వలుకున్. 59

మ. ఒడయండా! విను మేను దొల్లి భరతుం డోహో యనం బేర్మి నొ
ప్పెడుఱేఁడన్ దగులంబు వాసి యడవిన్ వేఁగించుచున్ న్నాళ్లు లొ
క్కెడ నీ రాడుచు లేడిపిల్లఁ గొని యెంతే ప్రేముడిన్ సాముటన్
బుడమిన్ లేడికిఁ బుట్టె వెండియును బాము ల్పొందితి స్వంటివే. 60

చ. వలమురితోల్పునందుఁ గడు బత్తి మెలంగుచు నుంటేఁ గాన నా
పోలు పఱియున్న మే న్విడిచి పుట్టితి నిట్టులు జన్నిగట్టునై
తెలివి యొకింత కల్గుటను దిక్కుల వెన్నుఁడు దక్క నొక్కఁడుం
గలుగఁడ టంచు నెంచుచు నొకండ మెలంగుచు నుంటి నిట్లుగన్. 61

వ. రాయా! యెల్లవారలు పెద్దలం గొల్చుటంజేసి తగులంబులం బెడఁ
బాసి తెలివి గలిగి సిరిచెలువునిం గొలుచుచున్న యెడ విడుపుం
జెందుదు రని మఱియును. 62

ఉ. ఇల్లనుకాలుకానఁ దమ రేదియొ కోరి మెలంగుచుండఁ దా
రల్లన వచ్చి కోర్కు లనునార్వురు దొంగలు పున్నె మన్న సొ
మ్మెల్లను దొంగిలించుకొని యేగినయంతట దిక్కులేనిదై
యుల్లము పల్లటిల్ల గొంగ లొందెడు మానిసిపిండు పొందుగన్. 63

తే. కాపురం బనునడవిలో నేపుమీఱు
నాలుబిడ్డలు నాఁబడునట్టినక్క
లెల్లఁ జెలరేఁగి మానిసియెముక లెల్లఁ
గొఱికి తిన వాఁడు పా డయి యుఱక చచ్చు. 64

తే. అడవిలోపలఁ గొఱవిదయ్యంబుఁ గాంచి
యగ్గి గొన వెంట నరిగెడునవువు దోఁప
నాలుబిడ్డలఁ బ్రోవ సొమ్మాసఁ జెంది
మెలఁగుఁ గలవారియిండ్లపంచలను వెడఁగు. 65

క. ఎడ నెండమావులం గని కడుదగ నీరాడునిచ్చఁ గాల్కొలఁదిం బా
ఱెడుమెకములవడువున, నవ్వెడఁగులు కాపురముసేయ వెడలెదరొడయా.

క. ముక్కాలిముడుక తైనను, ఱొక్కము గడునిచ్చునేని రోయ కతనికిన్
జక్కనికన్నెల నమ్మెద, రక్కట పాలసులు వారి నజ్ఞముఁ డణఁచున్.

క. నీకీకాని యొనంగెద నీకసుగందువును బట్టి కడతేర్పు మనం
బోకంత నందియుంపడ, కాకట్టిడి చంప నుండు నవ్వాని నయో. 68

క. కలుములుగలిగెడుననుచుఁ, దెలిసినయేఁ గన్నబిడ్డ నేఁ జెలినే
బాలియింపవెనుకఁదీయరుతులువలువారలకుఁ జనుఁడుదోసఁగుల్గూర్చున్.

మ. తెరువుల్గొట్టుచుఁ గన్నపెట్టుచును బ్రాఁతిం జూద మెప్డాడుచున్
దరిఁ దాటోటు లనెన్నియేఁ బలుకుచున్ దా రెంగిళుల్ మెక్కుచున్
బరికింపం గలయట్టి చెడ్డపనులం బాటించుచున్ రొక్క మీ
వరుసన్ బ్రోఁగులు వెట్టి దాఁప జెనఁటుల్ పాటంది పోకార్తు రా.

క. పులినంజుడైన మెసవుచుఁ, గలుద్రావుచు నోడలుమఱచి కన్గానక యొ
ప్పులవారిం దూఱెద ర,త్తులువల కిం దందు మంచిత్రోవలు గలవే.

క. ఇరుగుంబొరుగుల గరితల, వరుసయు వావియును లేక వడిఁజెఱచుచు నె
త్తఱి గండకావరమ్మునఁ దిరిఁగెద రవ్వారిపేరు దెలిపినఁ జెడు గా.

చ. చదివితిఁ గైతఁ గట్టితిని చాల యసంబు గడించితిన్ ననున్
బదుగురు మెచ్చుచుండి రిఁక నాకుఁ బురుం డొకరుండు లే డటం
చెద గరువంబునన్ మెలఁగు చెంతల నేనియుఁ దండ్రి నేనియుం
గొదుగక దూఱుమొఱకునకుం గొద లంటక పోవ వెన్నియేన్. 73

వ. మఱియు నట్టిదోసకారులొరులు దూఱిన వగచుచు నాఁకలిం గొన్న నాఁడు గొడ్డుచెట్టుల నాసించునట్లు దొరలం జేరి కొల్చుచు దగఁ గొని నీరులేనిపాడునూతిం జేరినట్లు పాలసులం గూడుచు మేను గాలిన వాఁడు కాఱుచిచ్చుఱికినట్లు దాయలం జేరి బువ్వఁ గోరుచు సొమ్మునకై తల్లిదండ్రులు నన్నదమ్ములు లోనగుచుట్టంబుల నైనం బట్టి చంపుచు నిట్లు పెక్కుచందంబులఁ జెడుపనులవలనం బవళ్ళును నిదుర మొదలగువానివలన రేలునుం బోకార్చుచు నొండేమియు నెఱుంగక కాపురం బనుగడ్డిగప్పినపాడునూతం బడి యిడుమలం బడుచు వేఁగి వేఁగి తుదకుఁ జచ్చి జమునివలనం గొదలంబడుచుందు రని నెండియు.

ఆ. పనులకతన లచ్చి పెనిమిటిఁ దలఁపక
కాకి గ్రద్ద కొంగ గములతోడఁ

బురుడు వచ్చునాలిబూతంబు లను జెల్మిఁ
గలసి చెడును వారివలన నురక. 75

చ. తలఁచిన నోకిలింత లగుదట్టఁపుగెట్టను గొట్టుకొంచు బ్రేఁ
గులు నరము ల్పొర ల్తనదుకుత్తుకకు న్మొయికిం గడంకమై
దళముగఁ జుట్టఁ బెట్టుకొన దారి యొకింతయు లేక వేఁగుచున్
వెలలఁ దలంచె పో పొలఁతి పెన్గడుపన్ చెఱసాలయం దటఁ. 76

తే. ఇరుకుత్రోవను వెలివచ్చుతఱిని యుక్కు-
ముక్కలకుఁ బోనియెమ్ముల నొక్కులకుఁ
బట్టువాఁ డొందునంగద పోల్చి చూడ
వగపు పుట్టకపో దెట్టివానికైన. 77

క. గట్టా! పుట్టఁగ నగుని
క్కట్టులు వాఁ డెట్టియెట్టికట్టేఁడి యైనన్
జెట్టఁడు నాదాయకు నేఁ
బుట్టక పోవలయుఁ గాక పో యెకిమీఁడా. 78

చ. పుడమినిఁ బడ్డనాఁడుసుత పోయెడుదాఁక గడేని సమ్మళం
బెడఁదకు లేక యాఁకలికి నేఁకటినిద్దుర కెందు కెందు కె
ప్పుడును మెలంగుచున్ జెడుగుపోఁకల నాళ్ళులు వెళ్ళఁబుచ్చుచుఁ
వెడఁగులు మిత్రివాతఁ బడి వేఁగుదు రాజమువీట నక్కటా! 79

మ. పదియాఱేఁడులపాయ మొప్ప మెయికిం బాటింప కెవ్వారినిఁ
మదిలోఁ గావర మెప్పు పెచ్చి పెరుగన్ మానేదియు న్వావియున్
వదలంగాఁ బెరచేడెలం దగిలి దున్నం బోలి తాఁ జెడ్డమై
తుద కేసారును లేక చచ్చు వితగాదో వానిపు ట్టలికా. 80

చ. గరితలఁ బెండ్లియాడి చెలఁగఁ గొమరుల్ దగ నిల్లు దీర్చి కాఁ
పుర మొనరించుచున్ సుకము పొందెద మేము సంతసంబుతోఁ
దిరుగుటె కాని దాన నగుతిప్ప లొకింతయుఁ గాన రయ్యయో
యరయఁగ గుండె జల్లు మను నయ్యవి వాకొనునట్టిపాటివే. 81

క. మఱఁతులకేఁ గొడుకులకేఁ, జెడు గగుపను లబ్బెనేని చెప్పఁగ నవి య.
వ్వెడఁగుల వేయగువారలఁ, బడయఁగ నెవ్వాఁడు గోరు బాబూ! చెపుమా.

తే. అడరులేమిడి నైనఁ జేరాస నైనఁ
గడఁగి బొంకాడి యేనియుఁ గన్నపెట్టి
యేని కడు జూద మాడియే నెట్టులేని
సొమ్ము గడియించు నడె వాని సొంపు డింపు. 83

చ. బ్రతికినయన్ని నాళ్ళిట్టులు బాములకే యగుకాఁపురంబు నా
వితయగు పేరితోఁ దనరి వీఁగక మండెడు కారుచిచ్చులో
సతముగ నేగి వే మిడుతచంటమున న్బడి వేఁగి వేఁగి యా
మతకరి చచ్చి పుట్టు నది మానెడుదారి నెఱుంగఁ బోలదో. 84

క. పిచ్చుంగుంటియు గ్రుడ్డియు
హెచ్చుగ నగు చెవుడు మూఁగ యెంతయు తెవులున్
వచ్చినముదుసలివాఁడును
జచ్చుచునుం గొమ్మఁ గవయఁ జను నాహాహా! 85

తే. చన్ను లపరంజికుండలు కన్ను లాణి
తమ్మ లొడలెల్ల బంగార మమ్మ యనుచు
నింతిఁ గోరు నంజుడుముద్ద లెసఁగుపుసుల
తొట్టిలును గుళ్ళు కుళ్ళని తొలఁగ రకట. 66

. పెనుబాము విసం బొడలెక్కిన మందుల డింప వచ్చు గెరలెడి చెలిచూ
పనువిసము డిగక చెఱచున్, వినుమీ చెలిచూపు విసమొ విసమే విసమో.

వ. ఒరులకు మాడిగంపుఁబను లొయ్యనఁ జేసియు నేలఁ ద్రొవ్వియున్
జెఱువులనీరు తోలియును జేలును జెట్టులు ప్రోది వెట్టియున్
బరువడి నేమి లేక తను పాడగు మే నది పండుఁ గాని యె
ప్పరుసునఁ బండ కాస చిలవ ల్పలవ ల్గొనుచుండు నెప్పుడున్. 88

. తిన నాఁకు లలము లుండఁగఁ, గొన నేళ్ళు నీళ్ళు లుండఁ గొసరక కట్టం
జనునార లుండఁ బండం,గ నేల లుండ నోరుఁ గొల్వఁగా నేమిటికిన్,

ఆ. బ్రతుకు తరగలాట పసిజవ్వనము కొన్ని
నాళ్ళ మూట సుకము నీళ్ళమూట
బోటి సొమ్ము కొడుకు మేటిమెఱుపుతేట
యేటికయ్యా! యిట్టిపాటిబాట. 90

చ. తెలియఁగ నెంతవారు నొగిఁ ద్రెళ్ళిర కాని యొకండు మిత్తిక
న్నుల మసిఁ బ్రామి పొల్చుట కనుంగొనిరే వినిరే నెఱుంగ మీ
పొలిసెడునంతయున్ వినియు బూమె తెఱింగియు నుట్టిగట్టియు
య్యెల లిటు లూఁగుచుండు మని యెంచుట వెఱ్ఱితనంబు కాదొకో.

చ. మిసమిసలాడుచుం దమకు మే లిడుచుండెడునంత దాఁక నే
పసిఁ గొని బందుగుల్ గొలిచి వత్తురు లేమిడి జిక్కినప్డు రా
రుసు లెడలంగ మేను చెడి యున్నెడ నే మన నేవగించెడు
న్విసుగుగొనుం గడుం దెగడు నెచ్చెలియున్నన రేది వింటివే. 92

తే. కాపుర మనుకడలి నీఁద నోఁపురారి
యెట్టిగొదలను దీర్చెడునట్టిదారి
పుట్టి చావని సుక మిచ్చునట్టిదారి
బమ్మ మరయుట యని లోన నమ్మ తేఱి. 93

చ. దళముగఁ గంటికిం బొరలు దాకకమున్న నొడ ల్వడంకుచున్
మలఁగకమున్న లోఁదెలివి మా నఱి పోవక మున్న కాళ్ళునే
తులు సెడిపోకమున్న తగుత్రోవలఁ బోనగు నిండ్లు గాల బా
వుల నొగిఁ ద్రవ్వఁ బూనుటలు పోలునొకో తలపోసి చూడఁగన్.

వ. అని మఱియు బాటసారి యేమఱఁగుం జూచుచు లోఁతునూతం బడి
చచ్చినతెఱంగునఁ గాపురంబునం గస్తిపడుచు నడుచువాఁడు జెడుం
గావున నీవు రాయఁడ నను గరువంబు విడిచి యన్నిటియందు సరి
యగుచెలిమి వాటించి తెలివి యనుకత్తిచేఁ దగులం బనునడవి నఱికి
మీఁదిద్దారిఁ దెలిసి మెలంగఁ దగునని వెండియును. 95

క. మన మన బమ్మం బనఁగాఁ,గనుఁగొన వేఱింత యేని గలుగదు సుమ్మీ
తనలోన నిట్లు తెలిసిన,తనుపో మఱి పుట్టి చాక తనరెడునతఁడున్.

ఆ. ఉసురు దాల్పులందు నెసఁగుమానిక మూక
దానియందుఁ దెలివి నూసినట్టి
తపసిరాయఁ డతని కెపుడుఁ జాలినవాఁడు
వేల్పు లేఁ డటంచు నిల్పు మీవు. 97

వ. ఆతపసి గోచియుం బెట్టక పిచ్చివానివలెం దిరుఁగుచుండు నతం డే
దేవర యతనిఁ గొలువ నన్నియుం జేకూరు నని యెఱింగించిన సంత
సించి యతం డతనికిఁ జాగిలి మ్రొక్కి యి ట్లనియె. 88

ఉ. పాఱుకొలంపుమానికమ! పట్టిపయిం గలగారవంబునన్
మీ రెఱిఁగించుసుద్దులను మీఱెననాచెడుబుద్ధియంతయున్
దీఱెను దోసముల్ నడిచెఁ దెల్వియు మించెను నాకొలంబునన్
జేరెను బున్నె మే విడుపుఁ జెందెద మీయడు గంటి కొల్చుటన్.

తే. నీదుపలుకను చందున నాదులోని
గరువ మనియెడుకటికిచీఁకటి దొలంగె
తెలివి యనుపండువెన్నెల తేఱె కాయు
దొంగ లార్వురు తిరుగక లొంగినారు. 100

ఆ. నీదుబోదఁజేసి నాదులోఁ గడుతెల్వి
నైన సంతసం బటనెడునిండు
చందమామ వొడిచె నిందందుఁ గలబమ్మ
మన్నసామ్ముఁ గంటిఁ గన్నతండ్రి. 101

శా. మీఱుం గావర మూరకే చెడఁగ నామీబిడ్డ నన్ బ్రోఁచుటన్
మీరే తల్లులు మీరే తండ్రు లనుఁగుల్ మీరే దొరల్ బందుగుల్
మీరే వేల్పులు మీరె యెల్లరును మిమ్మె నమ్మితిం జుండి లో
నేరు నీ్మకును వేఱు లేరు గదె తండ్రీ పీనినిం గావుఁడీ. 102

వ. అని కడుదెఱంగులఁ గైవారంబుఁ జేసి వేడుకమెయి వీడుకోలు వడసి
యతం డన్నియునుం బెడఁబాసినవాఁడ కాన వెంగలి యన నెటయేని
యాడనిం బాడె నంత నాభరతుండునుం దనకు మేనుగలకర్జంబు
దీఱెఁ గానఁ దొల్లింటి గండకివాఁకయొడ్డునకుం జని కూరుచుండి మెండ
గుబత్తిం దనడెందంబునం దనకువేఱుగానివాని నిట్లని తలంచుచుండె.

చ. నలకలకన్న నల్కయి కనంబడి పెద్దలకన్నఁ బెద్దయై
నెల వొకచోటు నాక మఱి నింగియు నేలయు నిండఁ బొంగియున్
దులవలకెల్ల లే డనఁగఁ దోఁచెడుదేవర తాను నేన యై
వెలిఁగెడుజోతినిం దలఁచి వేయుఁదెఱంగులఁ గొల్తు నిచ్చలున్. 104

ఉ. ఈ వన నొక్కఁ డే ననఁగ నెంచ మఱొక్కఁడునే జగంబులో
నీ వన నే ననంగ నొకఁడే యగు సందియ ముండ దైన నిం
కీ వన నే ననంగ నుడు లేగక యున్నవి రెండు వానినిం
బోవఁగఁ జూచి నన్ను నినుఁ బొందఁగఁ జేసి కడంకఁ బ్రోవవే. 105

ఆ. తలఁపఁ జీమగోలె నలువవఱకు నంత
నీవ యగుచు నంత నీదులోన
నుండె నంతలోన నుండఁగ నీవు నీ
యంతఁ జేయుచుంటి వయ్య తండ్రి. 106

ఉ. నింగియు నేల గాలియును నీళ్ళును నగ్గియు నీదురూ పటం
చుం గలతొంటిమిన్కు లవి చొప్పడఁ జెప్పుచు నుండఁ దండివై
పొంగుచు నిజ్జగంబులను బొంది రవంత యెడంబు లేక నిం
డం గనుపింతు వం చనుట నాయముగా నినుఁ జేరి రెల్లరున్. 107

ఆ. మెఱుఁగుజోతి వోలె మెఱుఁగుచు నాలోన
నున్ననన్ను నేన యెన్నికొలుతు
నిన్ను మాఱు గాఁగ నీవు దిరుండవు
జగము దిరముగాని సరణి తెలిసి. 108

క. తలచుటకుం బలుకుటకుం దల మిసుమంతయును గానిదయ్యమ!నిన్నుం
గలసినకతమున నేమో, తలఁచుచునుంటిని వెలుంగుతలఁపున జేజే.

వ. అని పలుదెఱంగులఁ దలపోయుచు దివ్వె దివ్వెం గలసినట్లు బమ్మం
గలసి మెలసి మెలంగుచుండె. 110

క. అని శుకుఁడు పరీక్షిత్తున,కును దెలిపినయట్లు శౌనకుఁడు మొదలగుబా
పనఱేండ్ల కిట్లు సూతుఁడు,వినిపించెన్ భరతుకతను వేడుక మీఱన్.

క. భాగవతంబునఁ గలకత, బాగుగఁ దిలకించి యిట్లు వ్రాసితి దీనిన్
వీగక చదివిన వినినన్, వేగమ సమకూరు తెలివి వెడలని సిరియున్. 112

ఆ శ్వా సాం త ము.

మాలిని. కుదు రెపు డగురాయా! కూళరాకాసిదాయా!
మొదటఁ బొడమునయ్యా! ముజ్జగం బేలుజియ్యా!
చదువుపజలపట్టా! సా దుచున్నట్టిదిట్టా!
పెదతపసులప్రాపా! పేర్మిమై నుండుమాపా! 113

గద్యము. ఇది శ్రీమహామహోపాధ్యాయ, కలాప్రపూర్ణ, కవిరాజ,
కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి
ప్రణీతంబయిన బ్రహ్మానంద మను
నచ్చతెలుఁగు ప్రబంధంబున సర్వం
బును దృతీయాశ్వాసము

శ్రీ శ్రీ శ్రీ

పంచరత్నములు.

క. శ్రీపీఠికాపురీశ్వర, గోపాలకృపావిశేషగుణభూష ధరి
త్రీపాల వినుతవిభవ, వ్యాపక శ్రీసూర్యరాయ వరకవిగేయా.

మ. అల గంగాధరభూధవేశ్వరవరాత్మాంచత్కుమారుండవై
విలసచ్ఛాస్త్రముఖప్రసక్తిని జగద్విఖ్యాతిమై నొప్పి భూ
తలమం దున్నతశక్తిఁ దాల్చి కలుషార్థగ్రావభేదంబు పే
రలుకం జేసి యశంబు గంటివి కుమారా! పీఠికాధీశ్వరా.

మ. పరిషద్దక్షిణ వేసవే లిడి కళాభవ్యాంధ్రభాషాంతరాం
తరదోషంబు లడంగిపో సుకృత మేతద్భూమిభాగంబునన్
స్థిరతం జెందఁగఁ జేసి తట్టె విజయశ్రీపీఠికాపట్టణే
శ్వర! నీ విప్పటి కృష్ణరాయఁడవు గావా సూర్యరాయండ వా.

మ. పసివాఁడై తగునప్డె తండ్రియును నాప్పైఁ దల్లియుం బోయిన
న్మిసిమింతుం డయి రాజకీయములఁ బేర్మిం గెల్చి ధర్మస్థితిన్
వసుధారాజ్యభరంబుఁ బూని సుకవివ్రాతంబు లగ్గింపఁగాఁ
బస మీఱం బ్రజ నేలు రావుకులరాడ్వర్యుండు సామాన్యుఁడే.

చ. సహజగుణంబుశాంత మది స్వాంతమునం పొలు పొందదాయనే
సహనమునం గనుంగొనుచు సంతతముం గరుణార్ద్రచిత్తుఁడై
మహిపతి యైన వేంకటకుమారమహీపతిసూర్యరాయఁ డీ
మ్మహి నిరమిత్రుఁడై నృపతి మండలమండితుఁడై తలిర్చుతన్.

శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి.

26838
2.3.73